www.velthuru.com

RNI TEL TEL/ 2019 / 78609

రంగారెడ్డి

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక

ఆదివారం 15 జూన్ 2025

సంపుటి :07 సంచిక : 19 , పేజీలు : 12 వెల:రూ.5/-




## సీఎంఆర్ఎఫ్ చెక్కులు బాధితులకు అందజేత

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జూన్ 14:** పేద ప్రజలంతా కూడా రోగాల బారిన పడి ఆసుపత్రికి వెళ్ళినప్పుడు లక్షల రూపాయలు బిల్లు కడతానే గాని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్సలు దొరికేటువంటి పరిస్థితులు లేవని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంప్

# విమాన ప్రమాద ఘటనపై ఐదుగురితో కమిటీ

వివిధ రంగాల నిపుణులతో ఉన్నతస్థాయి దర్యాప్తు

బ్లాక్‌బాక్స్ విశ్లేషించాక అసలు విషయాలు గుర్తింపు

భవిష్యత్‌లో ప్రమాదాలు జరక్కుండా లోతుగా అధ్యయనం

కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు




**న్యూఢిల్లీ,జూన్14( వెలుతురు):** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన దుర్ఘటనను పౌర విమానయాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానయాన భద్రతపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం దిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టినట్లు తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం, పౌరవిమానయాన శాఖ సంయుక్తంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే మంటలార్పి.. మృతదేహాలను అక్కడి నుంచి తరలించాం. దుర్ఘటనపై విచారణకు తక్షణమే ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశాం. అవసరమైతే మరికొంత మంది సభ్యులనూ బృందంలో చేరుస్తాం. శుక్రవారం సాయంత్రం ఘటనాస్థలిలో బ్లాక్స్‌బాక్స్ దొరికింది. దానిని విశ్లేషించిన తర్వాత ఏం జరిగిందనేది



## జి-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని మోడీ

## తెలంగాణ నుండి ఆసియా కప్ భారత మహిళా సాఫ్ట్ బాల్ జట్టు కి ఎంపికైన చెపుర్వ ప్రవళికకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు




**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:** భారత జట్టు 2025 జూలై 14-20 వరకు చైనాలోని జియాన్‌లో జరిగే ఆసియా కప్ ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ కోసం హైదరాబాద్ కి చెందిన చెపుర్వ ప్రవళిక భారత్ జట్టు కు ఎంపిక కావడంతో ఈరోజు మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం చెపుర్వ ప్రవళిక ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ నుండి భారత మహిళా జట్టు క్రీడాకారిణిగా చేపురువ ప్రవల్లిక ఎంపికవడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. చెపుర్వ ప్రవళిక కు ప్రత్యేక కోచింగ్ క్యాంప్ జూన్ 20 నుండి జూన్ 25, 2025 వరకు శ్రీనగర్‌లో జరుగుతుంది. చైనా లోని జియాన్ లో జరగనున్న ఆసియా కప్ సాఫ్ట్ చెపుర్వ ప్రవళిక ఆసియా కప్ బాల్ పోటీల్లో ప్రవళిక బాగా రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## వరుసగా రెండోరోజూ ఎఐజి ఆస్పత్రికి కెసిఆర్

- జలుబు తదితర కారణాలతో వైద్య పరీక్షలు



**హైదరాబాద్, జూన్14(వెలుతురు):** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వెళ్లారు. గత కొంత కాలంగా జలుబుతో బాధపడుతున్న కెసిఆర్ ఆరోగ్య పరీక్షల కోసం శనివారం ఉదయం ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. ఆయన వెంట కుటుంబసభ్యులు, మాజీ మంత్రి హరీష్ రావు, తదితరులు ఉన్నారు. శుక్రవారం కూడా ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న కెసిఆర్ మరోసారి ఆస్పత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తి అయిన తర్వాత నందీనగర్‌లోని నివాసానికి వెళ్లనున్నారు. ఐదు రోజుల పాటు- నందీనగర్

# హైటెక్స్‌లో సినీ సందడి

- అట్టహాసంగా గద్దర్ అవార్డుల వేడుక
- తరలివచ్చిన తెలుగు తారా లోకం
- అల్లు అర్జు, బాలకృష్ణలకు రేవంత్ అవార్డుల అందచేత


**హైదరాబాద్,జూన్14( వెలుతురు):** తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం హైటెక్స్‌లో ఘనంగా మొదలైంది. దాదాపు దశాబ్దం తరవాత మళ్లీ సినిమా పండగ జరగడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు- పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. సినీ ప్రముఖులు బాలకృష్ణ, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, నాగ్ అశ్విన్, సుకుమార్, మణితర్నం, సుహాసిని తదితరులు సందడి చేశారు. పలువురు విజేతలకు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి అవార్డులు అందజేశారు. ఉత్తమ హీరో అవార్డును పుష్పకు గాను హీరో అల్లు



అర్జున్‌కు సిఎం రేవంత్ రెడ్డి అందించారు. మెమెంటోతో పాటు నగదు పరుస్కారం అందచేశారు. అలాగే బాలకృష్ణకు ఎన్టీఆర్ మెమోరియల్ అవార్డును అందచేశారు. ఈ సదర్భంగా అవార్టును అందించినందుకు అల్లు అర్జున, బాలకృష్ణలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరంపర కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సినీ ,రాజకీయ ప్రముఖులు భారీగా తరలి వచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి చీఫ్ గెస్ట్ గా

## శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు రెడీ

- 19న స్పేస్ స్టేషన్‌కు ముహూర్తం ఖరారు



**న్యూఢిల్లీ,జూన్14( వెలుతురు):** ఇండియన్ ఆస్ట్రోనాట్ గ్రూపు కెప్టెన్ శుభాన్శు శుక్లా అంతరిక్ష ప్రయాణానికి ముహూర్తం ఖరారైంది. జూన్ 19వ తేదీన ఆయన అంతరిక్ష ప్రయాణం చేయనున్నారు. ఫాల్కన్ 9 రాకెట్‌లో ఇంటర్‌నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లనున్నారు. అక్కడే 14 రోజుల పాటు ఉండనున్నారు. ఈ రాకెట్ గత నెలలోనే అంతరిక్షంలోకి వెళ్లాల్సి

## 42శాతం బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

- సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు పోరాడాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత




**హైదరాబాద్, జూన్14( వెలుతురు):** బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ఊరుకోబోమని రేవంత్ సర్కారును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలని

## ముగ్గురు మంత్రులకు ఛాంబర్ల కేటాయింపు


- త్వరలోనే అధికారిక విధుల్లోకి మంత్రులు



**హైదరాబాద్,జూన్14( వెలుతురు):** తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రులకు సచివాలయంలో చాంబర్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీఏడీ చాంబర్ల కేటాయింపుపై ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల

## లక్కీ నంబరే కొంపముంచిందా?

- రెండుసార్లు టిక్కెట్ క్యాన్సిల్ చేసుకున్న రూపాని





**అహ్మదాబాద్,జూన్14( వెలుతురు):** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ ప్రయాణానికి సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. లండన్‌లో ఉన్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు వెళ్తున్న రూపాణీ.. అంతకుముందు రెండుసార్లు వెళ్లేందుకు సిద్ధమై టికెట్ రద్దు చేసుకున్నట్లు తెలిసింది. చివరకు మూడోసారి బయలుదేరినప్పటికీ గమ్యాన్ని చేరకముందే విమాన


విలేకర్లు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో దిగ్విజయంగా ప్రచురించబడుతున్న

వెలుతురు దినపత్రికలో

పనిచేసేందుకు సామాజిక అవగాహన, ప్రజా సమస్యలపై స్పందించి, నిజాన్ని నిగ్గుతేల్చే విలేకర్లకు ఇదే మా ఆహ్వానం

విద్యార్థహ : కనీస అనుభవం కలిగి, డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత

అవసరమైన జిల్లాలు :
వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, నల్లగొండ
సూర్యాపేట, యాదాద్రి - భువనగిరి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట

Email : srishanthipublication15@gmail.com

Cell : 863 984 0328


## మహిళలను కించపరిస్తే చర్యలు తప్పవు



- కూటమి ప్రభుత్వంపై జగన్ కుట్రలు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చర్యలు
- జగన్ కుట్రలను రాష్ట్రంలో సాగనివ్వబోం
- మీడియా సమావేశంలో హోంమంత్రి అనిత

**విజయవాడ,జూన్14( వెలుతురు):** మహిళలను కించపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. వైకాపా అధినేత జగన్.. కూటమి ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయిస్తున్నారని, బురద జల్లేందుకు అనేక

## మధ్యప్రదేశ్ ఎన్‌కౌంటర్

నలుగురు మావోల మృతి



**భోపాల్, జూన్14(వెలుతురు):** మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. బాలాఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ నిఘా వర్గాల నుంచి పోలీసులు, భద్రతా

(మొదటి పేజీ తరువాయి..)

## జి-7 సదస్సులో పాల్గొనన్నున్న ప్రధాని మోడీ

18న క్రొయేషియా లో పర్యటిస్తారు. కేంద్ర విదేశాంగ శాఖ శనివారంనాడు ఈ వివరాలను వెల్లడించింది. ఎంఈఏ వివరాల ప్రకారం, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ ఈనెల 15-16 తేదీల్లో ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. రెండు దశాబ్దాలుగా ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో చర్చల అనంతరం లిమాసోల్‌లో వ్యాపార దిగ్గజాలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. రెండు దేశాల మధ్య దౌపాక్షిక సంబంధాల పటిష్టతకు మోదీ పర్యటన దోహదం కానుంది. అనంతరం కెనడాకు మోదీ బయలుదేరి వెళ్తారు. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఆహ్వానం మేరకు జూన్ 16-17 తేదీల్లో జరిగే జీ-7 సదస్సులో మోదీ పాల్గొంటారు. జీ-7 సదస్సులో మోదీ పాల్గొనడం వరుసగా ఇది ఆరోసారి. సదస్సు సందర్భంగా పలు ద్వైపాక్షిక సమావేశాల్లోనూ ప్రధాని పాల్గొంటారు. ప్రధాని తన పర్యటన చివర్లో క్రొయేషియాలో పర్యటిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్ ఆహ్వానం మేరకు జూన్ 18న ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. క్రొయేషియాలో భారతదేశ ప్రధానమంత్రి ఒకరు పర్యటించనుండటం ఇదే మొదటిసారి. ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రధాని పర్యటన ఒక మైలురాయి కానుంది. ప్రధాని ప్లెంకోవిక్, అధ్యక్షుడు జోరన్ మిలనోవిక్‌తో మోదీ సమావేశమవుతారు. యూరోపియన్ యూనియన్ భాగస్వాములతో మరింత పటిష్ట బంధాల గురించి చర్చిస్తారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు బాధితులకు అందజేత

కార్యాలయంలో ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలో గల 42 చెక్కుల సీఎంఆర్ఎఫ్ నిధుల చెక్కులను నాయకులతో కలిసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు మాట్లాడుతూ.... ప్రభుత్వాలే పూర్తిగా మీకు వైద్యంలో అండగా ఉంటామని అనేక సందర్భాల్లో చెబుతున్నప్పటికీ ఆయా కార్పొరేట్ ఆసుపత్రిలో బిల్లులు రావడంలేదని మేము ట్రీట్మెంట్ ఇచ్చే పరిస్థితిలేమని రోగులను ఆసుపత్రి నుంచి బయటికి పంపించిన సందర్భాలు ఉన్నాయన్నారు. పేదల పడుతున్నటువంటి బాధలను ప్రత్యక్షంగా చూసానన్నారు. ఆయుష్మాన్ భారత్ లో, ఆరోగ్యశ్రీలో ప్రతి పేదవాళ్లు ఏ రోగం వచ్చిన, కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్ళిన రూ.పది లక్షలకు ఉచితంగా వైద్యం అందించేలా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అసెంబ్లీలో పలుసార్లు మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే రోజులలో పేదల అండ గా ఉండే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే.. ఒక్క రూపాయి లేకుండా పేదలకు కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందేలా చేస్తాను అన్నారు పేదల జీవితాల్లో సంతోషం చూడగలుగుతామన్నారు. గొప్ప ఆలోచనతో అదిలాబాద్ జిల్లాలో 1, 50 కోట్లతో ప్రధానమంత్రి రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారన్నారు. వైద్యులు లేక రోగులు హైదరాబాద్ నాగపూర్ వెళ్తున్నారన్నారు. ఇంత పెద్ద ఆపరేషన్ అయినా ఆదిలాబాద్ లోనే జరగాలని బలమైన కోరిక ఉందన్నారు. వైద్యుల కొత్త సమస్యను తీర్చాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ ఆదినాథ్. దయాకర్. జోగు రవి, భీమ్ సన్ రెడ్డి. కేశవ్. కర్ణాకర్ రెడ్డి. సత్యానందం. సన్నీ మహేందర్. పోతరాజు రమేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## వరుసగా రెండోరోజూ ఏఐజి ఆస్పత్రికి కెసిఆర్

నివాసంలో కేసీఆర్ ఉండనున్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. గతంలో యశోదా ఆస్పత్రికి కేసీఆర్ తరచుగా వెళుతుండేవారు. అయితే ఈసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. నిన్న సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసం నుంచి హైదరాబాద్ వచ్చిన కేసీఆర్.. ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించారు. మళ్లీ ఈరోజు కూడా రావాల్సిందిగా వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు నేడు ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంగా కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసంలోనే ఉంటు-న్నారు. అందుబాటు-లో ఉండాలని వైద్యులు చెప్పిన నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని నందినగర్‌లోనే ఉండనున్నారు. ఇక కాళేశ్వరం కమిషన్ విచారణకు ఈనెల 11న మాజీ సీఎం హాజరైన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా తనకు జలుబు ఉందని కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్‌కు చెప్పారు. ఓపెన్ కోర్టులో విచారణ వద్దని కేసీఆర్ కోరగా.. ఆయన వినతిని పరిగణలోకి తీసుకున్న కమిషన్ చైర్మన్ బహిరంగ విచారణను రద్దు చేశారు. ఇండోర్‌లోనే కేసీఆర్‌ను కమిషన్ ముఖాముఖిగా విచారించింది. ఇక అప్పటి నుంచి కూడా అనారోగ్యంతో కేసీఆర్ బాధపడు తున్నారు. ఈ క్రమంలో వైద్యపరీక్షల నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి మాజీ సీఎం కేసీఆర్ వెళ్లారు.

## శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు రెడీ

ఉండింది. అయితే, పలు కారణాల వల్ల ఐదుసార్లు ప్రయాణం వాయిదా పడింది. అన్ని అవరోధాలను దాటుకుని మరికొన్ని రోజుల్లో ఫాల్కన్ 9 అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. ఫాల్కన్ 9 అంతరిక్ష ప్రయాణంపై ఇస్రో ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో.. 'ఫాల్కన్ 9లో లిక్విడ్ ఆక్సిజన్ లీకేజ్ సమస్య ఉందని గుర్తించాము. దాన్ని సరిచేశాము. జూన్ 19వ తేదీన ఫాల్కన్ అంతరిక్షంలోకి వెళ్లనుంది' అని పేర్కొంది. త్వరలో ఫాల్కన్ 9 రాకెట్‌లో అంతరిక్షంలోకి వెళుతున్న శుభాన్షు శుక్లాకు నాసా మాజీ ఆస్ట్రోనాట్ 64 ఏళ్ల డాక్టర్ విట్సన్ సాకారం అందిస్తున్నారు. డాక్టర్ విట్సన్‌కు 650 రోజులు అంతరిక్షంలో ఉన్న అనుభవం ఉంది. ఆమె శుభాన్షుకు సలహాలు, సూచనలు చేస్తున్నారు. ఒక వేళ శుభాన్షు విజయవంతంగా అంతరిక్షంలోకి వెళితే.. ఆయన పేరిట రికార్డు నెలకొననుంది. భారతదేశం నుంచి అంతరిక్ష ప్రయాణం చేసిన రెండో వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారు. 1984లో మొదటి సారి భారత్‌కు చెందిన రాకేష్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లి వచ్చారు.

## హైటెక్స్‌లో సినీ సందడి

హాజరయ్యారు. నేషనల్ అవార్డ్ విన్నార్ , 2024 పుష్ప 2కి బెస్ట్ యాక్టర్ గద్దర్ అవార్డ్ విన్నర్ అల్లు అర్జున్ కూడా అటెండ్ అయ్యారు. ఫంక్షన్ లోకి వస్తుండగా మీడియాతో అల్లు అర్జున్ పుష్ప స్టైల్ లో తగ్గేదేలే అంటూ సింబాలిక్ గా చూపించాడు. హీరోలు అల్లు అర్జున్, బాలకృష్ణ, విజయ్ దేవరకొండ, నిర్మాతలు దిల్ రాజ్, అల్లు అరవింద్, సీనియర్ హీరోయిన్స్ సుహాసినీ, జయసుధ, జయప్రద, సింగర్ సునీత, మంగ్లీ.,దర్శకులు రాజమౌళి, సుకుమార్, మురళీ మోహన్, కీరవాణి, సింగర్ రేవంత్ తదితరులు హాజరయ్యారు. ఈ వేడుక ప్రారంభమైన కొద్ది సేపటికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి, హీరో అల్లు అర్జున్ హాగ్ చేసుకోవడం ఈ కార్యక్రమంలో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. తమన్ మ్యూజిక్ షో, స్పెషల్ డాన్స్‌లు ఆకట్టుకున్నాయి. దేశ వ్యాప్తంగా తగ్గేదేలే డైలాగ్ ఎంత ఫేమస్ ప్రత్యేక చెప్పాల్సిన పనిలేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంది అవార్డులు ఇవ్వగా 2014 నుంచి ఆ పక్రియ ఆగిపోయింది. మళ్లీ 10 ఏండ్ల తర్వాత ఇప్పుడు గద్దర్ అవార్డ్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పురస్కారాలను అందిస్తోంది. 2014 నుంచి 2024 వరకు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన సినిమాలకు, నటు-లు, దర్శకులు, టెక్నిషియన్లకు ప్రభుత్వం అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే.. సీఎం రేవంత్ రెడ్డి ఉత్తమ నటీనటులకు అవార్డులు ప్రదానం చేసారు.

## ముగ్గురు మంత్రులకు ఛాంబర్ల కేటాయింపు

మంత్రివర్గంలోకి తీసుకున్న అడ్లూరి లక్ష్మణ్‌కు సచివాలయ మొదటి అంతస్తులో 13, 14, 15, 16 నంబర్ గదులు కేటాయించగా, మంత్రి వివేక్ వెంకటస్వామికి రెండో అంతస్తులో 20, 21, 22 నంబర్ గదులు లభించాయి. వాకిటి శ్రీహరికి రెండో అంతస్తులోనే 26, 27, 28 నంబర్ గదులు కేటాయించారు. ఇప్పుడు చాంబర్లు కేటాయింపుతో వీరు త్వరలోనే తమ శాఖల అధికారిక బాధ్యతలను స్వీకరించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే వారికి శాఖల కేటాయింపులు కూడా పూర్తయ్యాయి. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ అభివృద్ధి, గిరిజన, మైనారిటీ- సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత వంటి సామాజిక రంగాలకు సంబంధించిన కీలక శాఖలు అప్పగించగా, వివేక్ వెంకటస్వామికి కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజీ వంటి పారిశ్రామిక రంగాల శాఖలు లభించాయి. వాకిటి శ్రీహరికి పశు సంవర్ధక, పాడి అభివృద్ధి, క్రీడలు, యువజన సేవల శాఖలు కేటాయించారు. ఈ నేపథ్యంలో సచివాలయంలో వీరికి కేటాయించిన కొత్త కార్యాలయాలు త్వరలో బిజీగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. కొత్త మంత్రులతో కార్యాలయాల్లో కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంది.

# విమాన ప్రమాద ఘటనపై ఐదుగురితో కమిటీ

పూర్తిగా తెలుస్తుందని అన్నారు. అందులో ఏముందో తెలుసుకునేందుకు మేమూ ఆతృతగా ఎదురుచూస్తున్నాం. దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాల బాధను అర్థం చేసుకోగలను. నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. ఆ బాధ నాక్కూడా తెలుసు. హోంశాఖ సెక్రెటరీ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. ప్రత్యేక అధికారులతో, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశాం. సంపూర్ణ దర్యాప్తు జరిపేందుకు ఈ కమిటీ సభ్యులు దోహదపడతారు. నిపుణుల విచారణ పూర్తయ్యాక తగిన సమయంలో మీడియాకు సమాచారమిస్తాం. రెండు నెలల్లోగా విచారణ పూర్తవుతుందని భావిస్తున్నాం. అంతేకాకుండా బోయింగ్ 787 సిరీస్‌ను తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించాం అని రామ్మోహన్ నాయుడు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. విమాన ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గడిచిన రెండు రోజులు భారంగా గడిచిందని..

ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఆ కుటు-ంబం అనుభవించే బాధ తనకు ప్రత్యేకంగా తెలుసన్నారు. విమాన ప్రమాదం జరిగిన వెంటనే నేను సంఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాం. ప్రమాదం స్థలాన్ని పరిశీలించాను. గుజరాత్ ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. పౌర విమానయాన శాఖ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుందన్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెడికల్, ఫోరెన్సిక్, టీమ్‌లతో పాటు ఐదుగురితో ఏఐబీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బ్లాక్ బాక్స్‌ను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని... అందులో ఉన్న సమాచారం కీలకంగా మారనుందని తెలిపారు. బ్లాక్ బాక్స్‌లో ఉన్న సమాచారం రానున్న రోజుల్లో కీలకమని చెప్పుకొచ్చారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి చైర్మన్ నేతృత్వంలో కమిటీ- వేసినట్లు- తెలిపారు. హోంశాఖ కార్యదర్శి, సివిల్ ఏవియేషన్ సెక్రటరీ, గుజరాత్ అధికారులు, పోలీసు కమిషనర్ అహ్మదాబాద్, స్పెషల్ డైరెక్టర్ ఐబీని ఈ కమిటీలో నియమించినట్లు చెప్పారు.

విమానాశ్రయం నుంచి 2 కి.మీ దూరం వెళ్లిన తర్వాత.. 650 అడుగుల ఎత్తులో ఉన్నప్పుడే విమానం కూలిపోయినట్లు- పౌరవిమానయాన శాఖ కార్యదర్శి తెలిపారు. అహ్మదాబాద్ ఏటీసీకి పైలట్ మేడే కాల్ ఇచ్చారు. విమాన సిబ్బందిని ఏటీసీ సంప్రదించినా స్పందన రాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయబృందాలు ఘటనాస్థలికి చేరాయి. రెండు గంటల్లో ఉన్నతాధికారుల బృందమంతా ఘటనాస్థలికి చేరుకుంది. గుజరాత్ ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించింది.సాయంత్రం 6 గంటలయ్యేసరికి అగ్నిమాపక శాఖ మంటలార్పేసింది. ఎస్‌వోపీ ప్రకారం.. తక్షణమే విచారణకు ఆదేశాలు ఇచ్చాం అని ఆయన వివరించారు. అహ్మదాబాద్‌లో ఈనెల 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటన యవత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ప్రమాదంలో మొత్తం 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒక్కరు మాత్రం మృత్యుంజయుడిగా నిలిచాడు.

## 42శాతం బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని.. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలన్నారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగానే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్దరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని.. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫొటో విడుదల చేసిందని.. ఆ ఫొటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారని.. రేవంత్ రెడ్డి మాత్రం లేరన్నారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్దాలు ఆడుతున్నారో అర్థమవుతుందన్నారు. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడు తున్నారని.. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టిపెట్టాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని.. చేస్తున్న జాబ్‌లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని.. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి అని.. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండేనని.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని.. దాదాపు రూ. 8వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని.. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోందని.. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని సూచించారు.

## లక్కీ నంబరే కొంపముంచిందా?

ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు ఆయన లక్కీ నంబర్‌గా భావించే '1206' సంఖ్య కలిగిన తేదీనే ఆయనకు చివరి ప్రయాణం అయ్యింది. రూపాణీ వ్యక్తిగత వాహనాలన్నీ అదే నంబరుతో ఉన్నట్లు సమాచారం. అయితే ఆ లక్కీ నెంబరే గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ ప్రాణం తీసిందనే ఓ చర్చ అయితే ప్రస్తుతం వైరల్ అవుతోంది. విజయ్ రూపానీ లక్కీ నెంబర్ 1206. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా.. ఈ నెంబరే తన అధికారిక వాహనానికి పెట్టుకున్నారు. అలాగే ఆయన సొంత వాహనాలు.. కారు, స్కూటర్‌లకు సైతం ఇదే నెంబర్ వచ్చేలా ఆయన చూసుకున్నారు. అయితే ఆయన.. తన లండన్ ప్రయాణాన్ని సైతం లక్కీ నెంబర్ వచ్చేలా చూసుకున్నారు. కానీ తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలిచినట్లుగా.. ఆ రోజు ప్రయాణమే ఆయనకు చివరి ప్రయాణం కావడం గమనార్హం. ఈ లక్కీ నెంబర్ రోజు తన ప్రయాణాన్ని ఆయన వరుసగా రెండు సార్లు టికెట్ బుక్ చేసుకుని మరీ రద్దు చేసుకున్నారు. మాజీ సీఎం విజయ్ రూపానీ కుమార్తె లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తోంది. ఈ నేపథ్యంలో విజయ్ రూపానీ భార్య ఇప్పటికే లండన్‌లో కుమార్తె వద్ద ఉన్నారు. దీంతో కుమార్తె వద్ద కొన్ని రోజులు ఉండి.. తిరుగు ప్రయాణంలో భార్యను తన తీసుకు రావాలని మాజీ సీఎం విజయ్ రూపానీ భావించారు. అందులో భాగంగా తొలుత లండన్ వెళ్లేందుకు మే 19వ తేదీన ఆయన విమాన టికెట్ బుక్ చేసుకున్నారు. ఆ తర్వాత దీనిని రద్దు చేసుకున్నారు. అనంతరం జూన్ 5వ తేదీన లండన్ వెళ్లాలని ఆయన భావించారు. కానీ ఆ టికెట్‌ను సైతం ఆయన రద్దు చేసుకున్నారు. చివరగా తన లక్కీ నెంబర్ కలిసేలా జూన్ 12వ తేదీన ఆయన లండన్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఎయిర్ ఇండియా విమానంలో 12డీ నెంబర్ సీటును ఆయన ప్రత్యేకంగా బుక్ చేసుకున్నారు. ఆ క్రమంలో ఈ ప్రయాణంలో తన లక్కీ నెంబర్‌గా భావించిన రోజే ఆయన మరణించారు. జూన్ 12వ తేదీ 1.38 గంటలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కొన్ని నిమాషాలకే కుప్ప కూలి మంటల్లో దగ్ధమైంది. అందులో రూపానీ కూడా ఉన్నారు.


# మహిళలను కించపరిస్తే చర్యలు తప్పవు

ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఆంధ్రప్రదేశ్ హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత మరోసారి నిప్పులు చెరిగారు. శనివారం అమరావతిలో ఏర్పాటు- చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉన్నంత వరకూ వైఎస్ జగన్ ఆటలు సాగవని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు ఎలాగైనా విఘాతం కలిగించాలని చూసే జగన్ కుట్రలు రాష్ట్రంలో సాగనివ్వబోమని ఆమె హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. దీనిని ఎవ్వరు విఘాతం కలిగించాలని చూసినా ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. మహిళల్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయాలనుకుంటున్న జగన్‌కు సిగ్గనిపించట్లేదా? అంటూ ఆమె సందేహం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా పొదిలిలో పోలీసులు తిరిగి ఎదురు రాళ్ల దాడి చేసి ఉంటే వైఎస్ జగన్ చుట్టూ ఎంత మంది మిగిలే వారో గుర్తుపెట్టుకోవాలంటూ వైసీపీ నేతలకు మంత్రి అనిత సూచించారు. కేజీ పొగాకు ధర కూడా తెలియకుండా రైతుల పరామర్శకు వెళ్లిన జగన్ మానసిక పరిస్థితి అర్థం చేసుకోవచ్చంటూ ఈ సందర్భంగా ఆమె వ్యంగ్యంగా పేర్కొన్నారు. పులివెందులకు మాత్రమే పరిమితమైన ఎమ్మెల్యేగా గుర్తుపెట్టుకోవాలంటూ వైఎస్ జగన్‌కు ఈ సందర్భంగా ఆమె సూచించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, తల్లులు సంతోషంగా ఉండటాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ విపక్ష పార్టీ కడుపు మంట చూస్తే నవ్వొస్తుందని ఎద్దేవా చేశారు. అమరావతి గురించి కొందరు వెధవలు చేసిన వ్యాఖ్యల్ని జగన్ సమర్థించటం సిగ్గుచేటు అంటు వ్యాఖ్యానించారు. సాక్షి జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు నిర్దోషి అంటూ సుప్రీంకోర్టు ఎక్కడా నిర్ధారించలేదని గుర్తు చేశారు. ఎలాంటి టీవీ డిబేట్లు నిర్వహించ కూడదని కొమ్మినేనికి సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మాత్రమే మంజూరు చేసిందని సోదాహరణగా మంత్రి వంగలపూడి అనిత వివరించారు. వైఎస్ జగన్, వైఎస్ భారతీతో క్షమాపణలు చెప్పించడానికి సమావేశం పెట్టుకోవాలంటూ వైసీపీ నేతలకు మంత్రి అనిత హితవు పలికారు. సాటి మహిళల్ని కించపరిస్తే ఆ అంశాన్ని సమర్థించుకోవడానికి వైసీపీ మహిళా నేతలు సమావేశం పెట్టుకోవడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా కూడా మిగలని పరిస్థితిని వైఎస్ జగన్ తెచ్చుకుంటు-న్నాడని జోస్యం చెప్పారు. తల్లికి వందనం నిధులపై లోకేష్ విసిరిన ఛాలెంజ్ స్వీకరించే దమ్ము ఒక్కరికి కూడా లేకపోయిందంటూ వైసీపీ నేతలపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్‌కు, గత ప్రభుత్వం తెచ్చిన బూటకపు దిశ యాప్‌కు పొంతనే లేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అభివృద్ధిని అడ్డుకోవచ్చనే కుట్రతో జగన్ కిందా మీద పడుతున్నారని విమర్శించారు. జగన్ రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుడు కాబట్టే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక పోతున్నాడన్నారు. పోలీసులు మీద రాళ్లు విసిరితే మాకు బీపీలు రావా? అని ప్రశ్నించారు. మాకు బీపీలు వచ్చినా, చేసిన అవమానాలకు కడుపు మండినా సంయమనం పాటిస్తున్నామని మంత్రి వంగలపూడి అనిత గుర్తు చేశారు. డైవర్షన్ పాలిటిక్స్‌ను జగన్ పే-టె-ంట్ తీసుకున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ తన నియోజకవర్గానికి వస్తే ఐదుగురు పిల్లల ఉన్న తల్లులకు తల్లికి వందనం పడిన వారిని చూపిస్తానని చెప్పారు. డీఎస్సీ నిలుపుదల చేయటానికి సుప్రీంకోర్టు వరకూ వెళ్లి కుట్రలు చేయలేదా? అంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు చోట్లు- భారీగా గంజాయి పట్టు-కున్నాం. జగన్ ఎప్పుడూ మహిళలను అడ్డం పెట్టుకునే రాజకీయాలు చేస్తారు. ఆయన నడుపుతున్న ఛానెల్‌లో మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తే.. ఎలాంటి చర్యలు తీసుకున్నారు? సాటి మహిళలపై అసభ్య వాఖ్యలు చేసిన వారికి.. వైకాపాలోని మహిళా నేతలు అండగా ఉంటారా? చివరికి 'తల్లికి వందనం' పైనా రాజకీయం చేస్తున్నారు. కేవలం ఒకరికి మాత్రమే కాకుండా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ 'తల్లికి వందనం' ఇస్తున్నాం. గతంలో మాదిరిగానే రూ. 2 వేలు పాఠశాల నిర్వహణకు కేటాయిస్తే .. నిధులు దుర్వినియోగం చేశారని రాద్ధాంతం చేస్తున్నారు. తల్లికి వందనం నిధులపై లోకేశ్ విసిరిన ఛాలెంజ్ స్వీకరించే దమ్ములేదా? మేం తెచ్చిన శక్తి యాప్‌కు, గత ప్రభుత్వం తెచ్చిన దిశ యాప్‌కు పొంతనే లేదు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి జగన్ ఓర్వలేక పోతున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించి అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. పోలీసుల మీద రాళ్లు విసిరితే మాకు బీపీలు రావా? డైవర్షన్ పాలిటిక్స్‌కు జగన్ పేటెంట్ తీసుకున్నారు. డీఎస్సీ ఆపేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లి కుట్రలు చేయలేదా అని హోం మంత్రి ప్రశ్నించారు.

# నా ఇంటికి నన్నే పోనివ్వరా

- పోలీసుల తీరుపై కేతిరెడ్డి అసహనం

**అనంతపురం,జూన్14( వెలుతురు):** తాడిపత్రికి తనని పోలీసులు వెళ్లనివ్వడంలేదని తాడిపత్రి మాజీ ఎంఎల్ఏ కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. హైకోర్టు ఆదేశాలను ఆంధ్రప్రదేశ్ పోలీసులు పాటించడంలేదని ధ్వజమెత్తారు. తాడిపత్రిలో టిడిపి నేత జెసి ప్రభాకర్ రెడ్డి కనుసన్నల్లో ఖాకీలు చేస్తున్నారని విమర్శలు చేశారు. శనివారం ఉదయం తాడిపత్రికి వెళ్తున్న పెద్దారెడ్డిని యల్లనూరు మండల తిమ్మంపల్లి గ్రామ శివారులో వాహనాలను పెట్టి పోలీసులు అడ్డుకోవడంతో పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే తాడిపత్రి పర్యటన పలుమార్లు వాయిదా వేసుకున్నానని, తాడిపత్రిలో సొంతిళ్లు ఉందని, తన ఇంటికి తాను వెళ్తానంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. తాడిపత్రిలో టిడిపి గుండాలు కత్తులు, కటారాలతో సంచరిస్తున్నారని విమర్శలు గుప్పించారు. తాడిపత్రిలో ఐపిఎస్ అధికారి విధులు నిర్వహిస్తున్న ప్రయోజనం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. తాడిపత్రిలో గంజాయి, అక్రమ దందాలు కొనసాగుతున్నాయని, తాను తాడిపత్రికి వెళ్తే అక్రమ దందాలు సాగవని జెసి ప్రభాకర్ రెడ్డి భయపడుతున్నారని పెద్దారెడ్డి దుయ్యబట్టారు. విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఉండడంతో తనకు రక్షణ కల్పించలేమని ఎస్పి జగదీష్ తెలిపారన్నారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్తే ఆయనకు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.



## మధ్యప్రదేశ్ ఎన్‌కౌంటర్

దళాలకు సమాచారం అందింది. దీంతో ఆ అటవీ ప్రాంతంలో వారు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. ఆ క్రమంలో భద్రతా బలగాలను మావోయిస్టులు గమనించడంతో.. వారిపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు వెంటనే ఎదురు కాల్పులు జరిపాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆ క్రమంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వందల మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో అగ్రనేతలు సైతం ఉన్నారు. అయితే ఈ కూబింగ్‌ను తట్టు-కోలేక కొందరు మావోయిస్టులు సరిహద్దు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాలోకి మావోయిస్టులు ప్రవేశించారంటూ నిఘా వర్గాల వద్ద స్పష్టమైన సమాచారం ఉన్నట్లు- తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ యా జిల్లాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇంకోవైపు 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో వారి నిర్మూలన కోసం కేంద్రం వ్యూహాత్మకంగా ఆడుగులు వేస్తోంది. అయితే తాము చర్చలకు సిద్ధమని ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్ ఆపాలంటూ మవోయిస్టులు చేసిన విన్నపాన్ని అటు- కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు- ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం.

## సిఎంపై ఫిర్యాదు చేస్తే చర్యలు ఉండవా

- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర పోలీసుల తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫార్ములా ఈ కేసులో సీఎం రేవంత్ రెడ్డి వల్ల రాష్ట్రానికి రావాల్సిన వేలాది కోట్ల రూపాయాల ఆదాయానికి గండి పడిందని నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. కానీ ఇంత వరకు సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. కనీసం పోలీసులు ఫిర్యాదుదారునైన తనను విచారించకుండానే కేసు క్లోజ్ చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. సీఎం లేదా హోంమంత్రి మీద కేసు పెట్టకూడదని బీఎన్ఎస్ఎస్ చట్టంలో ఎక్కడైనా ఉందా? అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. ఉల్టా.. చేయని నేరానికి, ఫార్ములా వ్యవహారంలో ఒక తుఫైల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేటీ-ఆర్‌కు నోటీ-సుల మీద నోటీసులు పంపుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం? సీఎంకు ఒక రూల్.. సామాన్యులకు మరో రూలా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపికి ప్రేమ

- మాజీమంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**
కాంగ్రెస్, బిజెపిపై బిఆర్ఎస్ మాజీ మంత్రి నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఫైరయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముల్లుకుచ్చుకుంటే.. రాష్ట్ర బిజెపి నేతలకు నొప్పిలేస్తుందని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రాజెక్టులలో



జరుగుతున్న నష్టాల మీద రాష్ట్ర బిజెపి నేతలు, ప్రజా ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో నష్టాలపై ఎలాంటి కమిషన్లు వేయదని.. విచారణ కూడా చేయదన్నారు. శ్రీశైలం సొరంగం కూలినా.. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలినా.. వట్టెం పంప్ హౌస్ మునిగినా.. కేంద్రం ఎందుకు కమిషన్లు పంపడం లేదని మాజీ మంత్రి ప్రశ్నించారు. వాటి మీద విచారణకు రాష్ట్ర బిజెపి నేతలు ఎందుకు డిమాండ్ చేయరని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

# బనకచర్ల దోపిడీని అడ్డుకోవడంలో విఫలం

- ముఖ్యమంత్రి, నీటిపారుదల మంత్రుల నిర్లక్ష్యం
- కేంద్రం చేయూతనిస్తుంటే ఎంపిలు ఏం చేస్తున్నారు
- నిలదీసిన మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**
గోదావరి జలదోపిడీ జరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. దీనిని తక్షణమే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా మారిందో.. గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలా ఉపయోగపడుతుందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తుంటే తెలంగాణ సీఎం, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంటే.. మన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా మేం మద్దతిస్తాం. మీరు ముందుకు రాకపోతే భారాస పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఈ నెలాఖరుకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోంది. ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం పెట్టడానికి రావట్లేదు. కేటీఆర్, ప్రతిపక్ష నేతలపై ఎలా కేసులు పెట్టాలనే దానిపైనే ప్రభుత్వానికి ధ్యాస తప్ప మరోటి లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే




ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. గత రెండు కేంద్ర బడ్జెట్లు చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద.. తెలంగాణకు గుండు సున్నా. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే.. తెలంగాణకు సున్నా.. ఇదీ దిల్లీ పాలకుల వైఖరి అని విమర్శలు చేశారు. నిధుల్లో, నదుల్లో తెలంగాణకు అన్యాయం జరిగినా ఈ రాష్ట్రంలో ఉన్న 8మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది భాజపా ఎంపీలు నోరు విప్పడం లేదు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రుల నుంచి ఎలాంటి స్పందన లేదు. గోదావరి- బనకచర్లకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరిస్తోంది. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారు. 2 టీ-ఎంసీల బాబ్లీ నీటి కోసం చంద్రబాబు 2008లో పెద్ద పోరాటం చేశారు. 200 టీఎంసీలతో అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలి. రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే భారాసకు ముఖ్యం అన్నారు.

## ఉగ్రమూకలకు ఎదురొడ్డి ప్రాణార్పణం

### మరణించిన ఆదిల్ షా భార్యకు ప్రభుత్వ ఉద్యోగం

**శ్రీనగర్,జూన్14( వెలుతురు):**
జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన పహల్గాం ఉగ్రవాద దాడి ఉదంతంలో ఎదురొడ్డి నిలిచిన ధీరుడి ఆత్మకు శాంతి కలిగే సంఘటన ఇది. పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో చిక్కుకున్న పర్యాటకులను రక్షించే ప్రయత్నంలో స్థానికుడైన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా మరణించిన సంగతి తెలిసిందే. అతని కుటుంబ సభ్యులను జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఇవాళ కలుసుకున్నారు. దివంగత హుస్సేన్ షా భార్య గుల్నాజ్ అఖ్తర్‌కు ప్రభుత్వ ఉద్యోగమిస్తూ దానికి సంబంధించిన



అపాయింట్‌మెంట్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు భారత సర్కారుకు ధన్యవాదాలు తెలిపారు. కాశ్మీర్ లోని ఒక పేద కుటుంబంలో జన్మించి, ఇంటర్ చదివిన ఆదిల్.. అమర్‌నాథ్ యాత్ర సమయంలో పహల్గాంకు వచ్చే పర్యాటకుల కోసం పోనీ గైడ్‌గా పనిచేసేవాడు. యాత్రికుల్ని గుర్రంపై తీసుకెళ్లి వాళ్లకి అక్కడి ప్రదేశాలు చూపిస్తూ, వాటి గురించి వివరించేవాడు. ప్రతీ రోజులానే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఉగ్రమూక పర్యాటకులపై కాల్పులు జరుపుతోంది. దీంతో ఆదిల్ ఎంతో ధైర్య సాహసాలతో ఉగ్రవాదుల నుండి తుపాకీని లాక్కొని పర్యాటకుల్ని రక్షించడానికి తన వంతు ప్రయత్నం చేశాడు. దీంతో ఉగ్రమూక ఆదిల్‌ని గన్‌తో కాల్చి పొట్టన బెట్టుకున్నారు. కాగా, ఏప్రిల్ 22న పహల్గాంలో ఐదుగురు సభ్యుల ఉగ్రమూక, అక్కడి మైదానంలో విహరిస్తున్న పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని పొట్టనబెట్టు-కున్న సంగతి తెలిసిందే. ఈ మారణహోమానికి ఆదిల్ అహ్మద్ థోకర్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహించినట్టు- గుర్తించారు. ఇతడు పాకిస్తాన్ లో శిక్షణ తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చి ఇతర ఉగ్రవాదులతో సమన్వయం చేసుకుని, పర్యాటకులపై దాడికి పాల్పడ్డట్టు- సమాచారం. దీనికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి దాదాపు100 మంది ఉగ్రవాదుల్ని మట్టుపెట్టడం, తర్వాత ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడం జరిగాయి.



# సంపాదకీయం..

## విమానయాన రంగం పురోగమించాలి !

అహ్మదాబాద్ విమాన దుర్ఘటన నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. ప్రధానంగా సాంకేతికంగా మరింత నైపుణ్య సాధించాలి.

విమానయాన రంగంలో నైపుణ్యాలకు పెద్దపీట వేయాలి. విమనాలు బయలుదేరే ముందు కనీసం దాని సామర్థ్యం, లోపాలను పరిశీలించి ఓకే చేసిన తరవాతనే ప్రయాణానికి అనుమతి ఇవ్వాలి. ఇప్పటి వరకు అలాగే జరుగుతున్నా తాజా ఘటనతో లోపాలను వెలికి తీయాలి. అలాగే ఎయిరిండియా విమానం కూలడానికి రెండు ఇంజిన్లు ఫెయిల్ అయ్యాయని అంటున్నారు. అది ఢిల్లీ నుంచి బయలుదేరి వచ్చిందని అంటున్నారు. అలాంటప్పుడు ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై లోతుగా విశ్లేషణ చేయాలి. ఇకపోతే విమానయానరంగ నిపుణులను తయారు చేసుకునే అవసరం ఇప్పుడు వచ్చింది. ఈ రంగంలో ఇంజనీర్లయిన నిపుణుల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. 146 కోట్లు ఉన్న దేశ జనాభాకు తగ్గట్లుగా ఇప్పటికీ విమానాలు లేవు. ఉన్నకొద్ది విమానాలు సామాన్యుల అవసరానికి అనుగుణంగా లేవు. ఇంకా విమానాశ్రయాలు నిర్మించాల్సి ఉంది. స్పీడ్ యుగంలో ప్రజలకు విమానయాన ప్రయాణం అందుబాటులోకి రావాలి. నాణ్యమైన సేవలు అందించేలా ఈ రంగాన్ని తీర్చిదిద్దాలి. ఇవన్నీ తర్కిస్తూ...తాజా ప్రమాద ఘటనపై విశ్లేషణ చేయాలి. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులతో చర్చించాలి. ఈ ఘటన ఎందుకిలా జరిగిందో లోతుగా అధ్యయనం చేయాలి. నిజానికి అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన ఒళ్ళు జలదరింపచేస్తోంది. ఆ పెనువిషాదం గుండెలను పిండేస్తున్నది. వందల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఎందరో కలలను చిదిమేసింది. ఎయిరిండియా తప్పిదానికి వందలాది ప్రాణాలు గాల్లో కలిసి పోయాయి. అలవోకగా సముద్రాలను అధిగమించి, సునాయాసంగా వేలాదికిలోమీటర్లు దూసుకుపోవాల్సిన ఈ విమానం నేలకూలడంతో బతుకలు ఛిద్రం అయ్యాయి. నిత్యం వదదలాది విమానాలు క్షేమంగా గమ్యం చేరుస్తున్నాయి. వేలాది మంది తమ గమ్యాన్ని చేరుకుంటున్నారు. ఇలా ఎన్నో కలలతో తమ గమ్యానికి చేరుకుంటామన్న వారి జీవితాలు బుగ్గిగా మారాయి. ఎన్నో ఆశలు, ఆశయాలతో బయలుదేరిన వారంతా అర్థంతరంగా జీవితం చాలించారు. ఇందులో మరో విషాదమేమంటే ఏమీ తెలియని వైద్యవిద్యార్థులు భోజనానికి కూర్చున్న సమయంలో అనుకోని ప్రమాదం పిడుగులా దూసుకువచ్చిపడింది. దీంతో దాదాపు 33మంది మృతి చెందారని అంటున్నారు. నిజంగా వీరికోసం ఎందరో తల్లదండ్రులు కలలుకన్నారు. ఈ ప్రమాంతో ఇప్పటి వరకు 274మంది మృత్యువాత పడ్డారు. మరికొందరు ఇంకా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరంతా అతివిషాదంగా తమ జీవితాన్ని ముగించాల్సివచ్చింది. మహాశక్తిమంతమైన ఇంజన్లు కలిగిన , అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉన్న టాటాలు నడుపుతున్న విమానం లండన్‌లో నిక్షేపంగా దిగడానికి బదులు వందల అడుగులు లేవకుండానే కూలిన ఘటన మనకు గుణపాఠం కావాలి. మొత్తం విమానయాన రంగాన్ని ఆత్మపరిశీలనచేసుకోవాలి. విమనాల ఉత్పత్తి మొదలు సాంకేతకిత వరకు అన్నీ సమగ్ర అధ్యయనం చేయాలి. మాటలకు అందని మహావిషాదం ఇది. పట్టుమని తొమ్మిదివందల అడుగులు కూడా లేవలేక విమానం కుప్పకూలింది. విమాన ప్రమాదాల్లో సగానికి పైగా టేకాఫ్, లాండింగ్ సందర్భాల్లోనే జరుగుతాయి. తొలుత పక్షి ఢీకొన్నదేమోనన్న అనుమానాలూ ఉన్నాయి. టేకాఫ్ సక్రమంగా జరగలేదని, అందుకు తగినంత శక్తి సమకూరలేదని అర్థమవుతూనే ఉంది. ట్యాంక్ నిండా ఇంధనం ఉన్నా, సరఫరా వ్యవస్థల్లో లోపం ఉంటే, ఇంధనం సరిగా చేరక ఇంజన్ విఫలమవుతుంది. ఇంజన్ మీద అత్యంత భారం పడే టేకాఫ్ సందర్భం పైలట్ల నైపుణ్యానికీ, అనుభవానికీ కూడా ఓ విషమపరీక్ష. నిండుగా ఉన్న ఇంధనం నిక్షేపంగా గమ్యానికి చేర్చాల్సింది పోయి విమానం మొత్తం క్షణాల్లో భగ్గున మండేలా తోడ్పడింది. ఆ విమానం వైద్యవిద్యార్థుల హాస్టల్ మీద పడి, అనేక మంది ప్రాణాలు తీసింది. సమగ్ర పరీక్షలు చేయనిదే, ప్రయాణానికి నూరుశాతం అర్హమైనదని నిర్ధారణ కానిదే ఏ విమానమూ గాలిలోకి ఎగరదు. అత్యంత అనుభవజ్ఞులైన పైలట్, కోపైలట్‌కు ఏ మాత్రం అనుమానం కలిగినా ఈ ప్రయాణానికి అంగీకరించేవారే కాదు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగిన తరువాత, మొత్తంగా బోయింగ్‌మీద, ప్రత్యేకించి ఈ తరహా విమానాలమీద అనుమానాలు ప్రచారంలోకి రావడం సహజం. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఈ విమానాలు నిక్షేపంగా తిరుగుతున్నాయి. ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసిన సందర్భంలో టాటా సంస్థకు సంక్రమించిన విమానాల్లో కొన్నింటికి కాలం చెల్లడంతో వాటి ఆధునికీకరణ కూడా సాగుతోందని అంటారు. గత నెలలోనే నాలుగు వందల మిలియన్ డాలర్ల వ్యయంతో అది మలిదశ కార్యక్రమానికి నడుంబిగించింది. ఈ ప్రమాదం నేపథ్యంలో ఎయిర్ ఇండియా తన విమానాల సంపూర్ణ ప్రక్షాళనకు సిద్ధపడక తప్పదు. విమానాల ఆధునికీకరణకు సంబంధించి దేశీయ విమానయాన సంస్థలు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని వాటి తరఫున విదేశాలతో వ్యవహరించడం అవసరం. సాంకేతిక వైఫల్యాల నుంచి మానవ నిర్లక్ష్యం వరకూ ఈ ప్రమాదానికి దోహదం చేసిన అంశాలన్నింటినీ నిక్కచ్చిగా గుర్తించి, కఠినమైన చర్యలను చేపట్టడంతో పాటు, సరైన పరిష్కారాలను సాధించడం అవసరం. దేశీయంగా విమాన సాంకేతికతను బలోపేతం చేసుకోవాల్సిన అసవరం కూడా ఏర్పడింది. మనదశంలో ఐఐటిలు మొదలు అనేక ఇంజనీరింగ్ కాలజీల్లో చదువుతున్న లక్షల మంది యువ విద్యార్థుల్లో విమానరంగ విద్యపై శిక్షణ ఇవ్వాల్సి ఉంది. అలాంటి కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ రకంగా విద్యకు, ఉపాధికి లంకె వేసి దేశీయంగా విమానయాన రంగాన్ని బలోపేతం చేయాలి. మరిన్ని విమానాశ్రయాలను నిర్మించాలి. ప్రమాదాలపై తక్షణం అధ్యయనం చేయాలి. వాటిని ఆచరించి ముమ్మందు అలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే మనం సమర్థంగా ముందుకు సాగగలం.

# తెలంగాణలో స్థానిక సందడి

- మంత్రుల ప్రకటనలతో నేతల అలర్ట్
- గ్రామాల్లో ఊపందుకోనున్న రాజకీయ వేడి




**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**
తెలంగాణలో స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలంటూ మంత్రులు అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. గెలిచేది తామేనని కూడా ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో జూన్, జూలై మధ్య ఎన్నికలకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలను నిర్వహించేలా లోలోపల వేగంగా పావులు కదుపుతున్నాయని అనుకోవచ్చు. ఇటీవల మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క తదితరులు వరుస ప్రకటనలు చేస్తున్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల పేరుతో మంత్రులు జిల్లాల పర్యటనలు చేసేస్తున్నారు. ఇదంతా ఓ రకంగా ప్రజల్లో తమ బలాన్ని మరింత పెంచుకునేలాచేసే యత్నమని గుర్తించాలి. ఈ క్రమంలో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. కొన్ని రోజులుగా రాజకీయ పార్టీల సందడి జోరుగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేకున్నా ఖాళీగా కూర్చునే ఆలోచనలో లేరు. పార్టీలన్నీ ఏదో ఓ కార్యక్రమంతో ప్రజల్లోకి వెళుతున్నాయి. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నాయి. నేతలంతా ఏదో ఒక కార్యక్రమంలో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ కూడా నిత్యం కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతోంది. ఇలా జిల్లాలో ప్రధాన రాజకీయ పక్షాలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి బలోపేతం కావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో పేరిట ప్రజల్లోకి వెళ్లి తమ వాణిని వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్ దీనిని బాగా ఉపయోగించుకుంటోంది. తెలంగాణ మొత్తం అభివృద్ధి చెందిందన్న ప్రచారంతో ప్రజలను బురిడీ కొట్టిస్తోంది. తెలంగాణ సస్యశ్యామలం కావడమే గాకుండా బంగారు తునకగా మారిందన్న ప్రచారంతో నేతలు, అధినేతలు తరిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు కూడా పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా నేరుగా ఓటరు వద్దకు వెళుతున్నాయి. ఎమ్మెల్యేలు జనంలో ఉండాలన్న అధికార పక్షం ఆదేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ తమ గెలుపునకు వ్యూహ రచన చేస్తున్నారు. ప్రతిపక్ష ఆశావహులు సైతం గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పల్లెల్లో స్థానిక ఉన్నికల హడావిడి కనిపిస్తోంది.

నిత్యం ఎదో ఒక పార్టీ నేత, ఏదో ఒక కార్యక్రమం పేరిట ప్రజల వద్దకు వస్తున్నారు. తమ తమ ప్రభుత్వాల పాలన, పార్టీ కార్యక్రమాలు, లక్ష్యాలు, పనితీరును వివరించడానికి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానికి ఎన్నికల ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో రాజకీయ నాయకులు తమ దూకుడును పెంచుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హడావిడి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాలపై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజా ప్రతినిధులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. విమర్శలు చేస్తున్నారు. మంత్రులు రెవెన్యూ సదస్సులు ఇతర కార్యక్రమాల్లో భాగంగా ఊరూవాడ చుట్టేస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ఇతర ప్రజాప్రతినిధులు ప్రజలతో భాగస్వామ్యమై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇకపోతే విపక్ష బిఆర్ఎస్ గతంలో కెసిఆర్ సర్కార్ చేపట్టిన పథకాలను వివరించడం, లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాధీ ముబారక్, సీఎం సహాయ నిధి వంటి పథకాలు అటకెక్కాయని విమర్శలు చేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదకొండేళ్ల పాలనపై బీజేపీ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. స్థానిక నేతలు నియోజకవర్గాల పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన అందిస్తోందని విమర్శిస్తూనే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. మొత్తంగా అన్ని పార్టీలు ఇప్పుడు ప్రజల్లో ఉంటున్నాయి. తమ ఘనతను చాటుతున్నాయి. తామే బెటర్ అని చెప్పుకుంటున్నాయి.

# నైతరుతి మందగమనంతో వర్షాలు ఆలస్యం

- రైతన్నన్నను కుంగదీస్తున్న వర్షాభావం
- తొలకరి ఆలస్యంతో రైతుల్లో ఆందోళన



**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**
ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఇంకా ఎండాకాలం ఉందా లేక వానాకాలమేనా అన్నట్లుగా ఉంది. రుతుపవనాలు వచ్చి పక్షం రోజులు దాటినా పూర్తిస్థాయిలో వర్షాలు కురియడం లేదు. వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తొలకరి రాక ఆలస్యం కావడంతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు రైతులు సిద్దంగా ఉన్నారు. కొన్నిచోట్ల పత్తి నాటుకున్నారు. దీంతో ఆ రైతుల్లో ఆందోళన తీవ్రం అవుతోంది. గత వారంరోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే మండుటెండలు, వడగాల్పులు చూస్తుంటే మరో వారం దాకా తొలకరి చిలకరించే పరిస్థితి కానరావడం లేదు. ఇప్పటికే నైరుతి తొందరగా వచ్చింది. అయినా సకాలంలో వర్ృషాలు కరియడం లేదు. దీంతో సాగు భూములకు నీరు లేక నెర్రెలు బారుతున్నాయి. తొలకరి వర్షాలతో విత్తనాలు మొలకెత్తాల్సిన సమయమిది. వర్షాలు లేకపోవడం వల్ల మొలిచిన మొక్కలు ఒక పక్క ఎండుతుండగా, మరో పక్క సాగు భూములు నెర్రలు పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. కనీసం ఒక్క చినుకైనా గట్టిగా కురియకపోతే విత్తులు మురిగిపోవడం ఖాయంగా కనినిస్తోంది.మృగశిర కార్తె ప్రారంభంలోనే వర్షాలు కురియడం ఆనవాయితీ. అప్పుడే విత్తనాలు వేస్తారు. ఓ వైపు వ్యవసాయాధి కారులు హెచ్చరిస్తున్నా వినలేదు. దుక్కులు దున్ని చాలా మంది రైతులు విత్తనాలు నాటుకునేందుకు సమాయత్తం అవుతున్న తరుణంలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆందోళనతో చూస్తున్నారు. ఇక మొలచిన మొక్కలను బతికించుకొనేందుకు రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతం. వర్షాధారంపైనే ఆధారపడిన రైతులు అష్టకష్టాలు పడుతన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే అన్నదాతలకు కష్టాలు వెంటాడుతుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. చాలాచోట్ల ఎక్కువ మంది రైతులు వాణిజ్య పంట అయిన పత్తి పంటనే సాగు చేస్తారు. వర్షాకాలం ప్రారంభంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఖరీఫ్‌కు సిద్ధమయ్యారు. ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో ఎప్పుడు పడతాయోనని వాపోతున్నారు. నైరుతి రుతుపవనాలు మే నెలాఖరుకే రాష్ట్రాన్ని తాకాయి. రెండు రోజుల్లో తెలంగాణలోని మరికొన్ని జిల్లాలకు, ఆ తర్వాతి రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరిస్తాయని వెల్లడించింది. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకతో పలు జిల్లాల్లో వానలు పడ్డాయి. ఉరుములు, మెరుపుతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.


# దేశానికి ఆదర్శం కాళేశ్వరం

- దానిని ఉపయోగించే పని చేయండి
- మాజీమంత్రి వేముల సూచన



**నిజామాబాద్,జూన్14 ( వెలుతురు):**
తెలంగాణలో గత సిఎం కెసిఆర్ అనుసరించిన రైతు విధానాలను కాంగరెస్ పాటించివుంటే రైతులకు ఇన్ని కష్టాలు వచ్చివుండేవి కావని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేమల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరంను ఎలా ఉపయోగించుకోవాలో కూడా వీరికి తెలియడం లేదన్నారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యవసాయ రంగంలో ఓ రోల్ మాడల్‌గా నిలిచిందని అన్నారు. రైతుబీమా పథకం దేశానికే మార్గదర్శకంగా మారనుందని అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని తపించిన కెసిఆర్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా అనేకానేక చర్యలు తీసుకుని ముందుకు నడిపించారని అన్నారు. అయితే కాంగ్రెస్ ఇవన్నీ పక్కన పెట్టి కాళేశ్వరంపై బురదజల్లే చర్యలకు ఉపక్రమించిందని అన్నారు. తెలంగాణ రైతులకు అండగా ఉంటూ వ్యవసాయరంగంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బీమా అమలు చేసిన ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే నామినీకి పది రోజుల్లో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందించామని చెప్పారు. అందుకే ఈ పథకాలను తెలుసుకున్న దేశంలోని అన్ని రాజకీయపార్టీలు కేసీఆర్‌ను కొనియాడాయన్నారు. రైతుల కష్టాలు తెలిసిన కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. కాళేశ్వరంలో నీళ్లు ఎలా లిఫ్ట చేయాలో తెలియక పొలాలు ఎండబెట్టారని, ప్రాజెక్టుల్లో నీరు చేరకుండా చేశారని అన్నారు. కాళేశ్వరం సహా చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తయితే ఇక సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఇప్పటికే చెరువుల పునరుద్దరణ కారణంగా జలకళను సంతరించుకున్నాయని అన్నారు. దీంతో సేద్యం అన్నది రైతుకు భారం కాబోదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టాలని పేర్కొన్నారు. పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణలో 24గంటల కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని అన్నారు.

# వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరుడి రథోత్సవం



**తిరుపతి,జూన్14 ( వెలుతురు):**
తిరుపతి అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 9.00 గంటలకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. రథోత్సవంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి విహరించి భక్తులను అనుగ్రహించారు.ఉదయం 7 - 8.30 గం.ల మధ్య పుణ్యాహవచనం, నవగ్రహపూజ చేపట్టారు. తదుపరి రథారోహణం, నిర్వహించారు. 09.00 - 10.30 గం.లకు భక్తజనసమోహం మధ్య రథోత్సవం చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ, అశ్వవాహనంపై స్వామి వారు భక్తులను ఆశీర్వదించనున్నారు. ఆదివారం ఉదయం పల్లకీ ఉత్సవం జరుగనుంది. తదుపరి స్నపన తిరుమంజనం చేపడుతారు. అనంతరం ఉదయం 10.30 - 10.45 గం.ల వరకు తీర్థవారి చక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీవారి మాడవీధి ఉత్సవం జరుగుతుంది. రాత్రి ఏడుగంటలకు ధ్వజావరోహణతో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగియ నున్నాయి. వాహన సేవలో టిటిడి డిప్యూటీ- ఈవో హరీంద్రధనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ సంక్షేమ ప్రదాత బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారికీ పలు ఆహ్వానాలు, వినతులు



**కుత్బుల్లాపూర్ వెలుతురు జూన్ 14:**
శనివారం రోజున కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే గారి నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారిని కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు.

## బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారి చేతులమీదుగా "వావ్ కిడ్స్ పెబ్బల్" ప్లే స్కూల్ ప్రారంభం






**నిజాంపేట్ వెలుతురు జూన్ 14:**
శనివారం రోజున నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కాంతి నగర్ లో నూతనంగా ఏర్పాటుచేసిన వావ్ కిడ్స్ పెబ్బల్ ప్లే స్కూల్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....పిల్లలు విద్యను కష్టంగా కాకుండా ఆడుతూ పాడుతూ అభ్యసించేలా ప్లే స్కూళ్లు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమ్య, అడ్మిన్ ఇంచార్జ్ వరలక్ష్మి, నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పైడి మాధవి, బాలాజీ నాయక్, పెద్దిరెడ్డి సుజాత, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబ శివ రెడ్డి, స్వామి, వైయస్ , ప్రవీణ్, అనిల్, సతీష్ రెడ్డి, ప్రదీప్, బొబ్బ శ్రీనూ, బిక్షపతి, మేకల మధుసూదన్, దూసకంటి వెంకటేష్, విద్యా సాగర్,జల్గం చంద్రయ్య, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, ఇమ్మడి వేణు, తదితరులు పాల్గొన్నారు.

## శక్తిస్వరూపిణీ అయిన అమ్మవారిని కొలవడం ద్వారా సర్వదా విజయం చేకూరుతుంది

- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**గాజుల రామారం వెలుతురు జూన్ 14:**
శనివారం రోజున 125 - గాజుల రామారం డివిజన్ మిథిలా నగర్ లోని శ్రీ విజయదుర్గా దేవాలయ అష్టమ వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తిస్వరూపిణీ అయిన అమ్మవారిని కలవడం ద్వారా విజయప్రాప్తి కలుగుతుందని, అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు రంగరాయ ప్రసాద్, దేవాలయ కమిటీ సభ్యురాలు రజిని, అమరేశ్వరీ, సీమవో, పద్మా, శివలీల, భవాని, వాణి, మిథిలా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఠాగూర్, కార్యవర్గ సభ్యులు సురేష్, చెంగల్ రాయుడు, వెలగపూడి శ్రీనివాస్, చంద్రమోహన్, ప్రవీణ్, శివ, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**సుభాష్ నగర్ వెలుతురు జూన్ 14:**
శనివారం రోజున 130 – సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్ లోని బాడ్మింటన్ ఇండోర్ షటిల్ కోర్ట్ నందు ఏస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బాడ్మింటన్ టోర్నమెంట్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం టాస్



వేసి టోర్నమెంట్ ను ప్రారంభింపచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి.హేమలతా సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ఎస్.ఆర్. నాయక్ నగర్, అపురూప కాలనీ, మోడీ బిల్డర్స్ కాలనీల కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

## - బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**నిజాంపేట్ వెలుతురు జూన్ 14:**
శనివారం రోజున నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ కాకతీయ నగర్ లో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గండిమైసమ్మ – బాచుపల్లి ప్రధాన రహదారిలో డాక్టర్ రెడ్డీస్ వద్ద సిగ్నల్ ఏర్పాటుచేయాలని, అదే విధంగా కాలనీలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్డు పనులు, పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోజు రోజుకు వెలుస్తున్న కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పరుస్తున్నామని, రానున్న రోజుల్లో కాకతీయ నగర్ కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తానని అన్నారు. ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, మేనేజర్ పవన్, డీఈ వసంత, మేనేజర్ జై రాజ్, శానిటేషన్ ఇంచార్జ్ సుకృత రెడ్డి, విద్యుత్ ఏఈ శశిదర్,







మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పైడి మాధవి, బాలాజీ నాయక్, పెద్దిరెడ్డి సుజాత, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబ శివ రెడ్డి, స్వామి, వైయస్ , ప్రవీణ్, అనిల్, సతీష్ రెడ్డి, ప్రదీప్, బొబ్బ శ్రీనూ, బిక్షపతి, మేకల మధుసూదన్, దుసకంటి వెంకటేష్, విద్య సాగర్, జలగం చంద్రయ్య, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, కాకతీయ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షుకు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి వినోద్, కోశాధికారి దశరథ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అర్చనపల్లి సూర్యారావు జన్మదిన వేడుకలు...

**కూకట్ పల్లి జూన్ 14 వెలుతురు:**
కూకట్ పల్లి బిజెపి సీనియర్ నాయకులు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్చనపల్లి సూర్యారావు 67వ జన్మదిన వేడుకలు కూకట్ పల్లీ బిజెపి కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ హాజరై సూర్యరావు ను ఘనంగా శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సూర్యారావు కూకట్ పల్లి రామాలయంలో శ్రీ రాముల వారి దర్శనం చేసుకుని ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం బిజెపి ఆఫీస్ వద్ద ఏర్పాటుచేసిన వేడుకల్లో పాల్గొని కూకట్ పల్లి డివిజన్ 1వ, పోలింగ్ బూత్ అధ్యక్షురాలు వీరవేణి తన మిత్రులతో కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం బిజెపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు ,మహిళా మోర్చా నాయకులు, సూర్యారావు నీ కలిసి సన్మానించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. సూర్యారావు జన్మదినాన్ని పురస్కరించుకొని వారి తోటలో పండిన సహజ సిద్ధమైన స్వచ్ఛమైన రెండు టన్నుల మామిడి పండ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల



విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ సూర్యారావు చేతులమీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో కూకట్ పల్లీ అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్ రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, జిల్లా కన్వీనర్ ఎస్ మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, రాష్ట్ర బీసీ మోర్చా నాయకులు శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు, కూకట్ పల్లీ అసెంబ్లీ బిజెపి నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

*సర్పంచ్ ల సంఘం జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సుర్వి యదయ్య గౌడ్*








**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**
సర్పంచుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో తెలంగాణ గ్రామీణ పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయ గేటుకు వినతి పత్రంతో ముడుపు కట్టడం జరిగినది, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి , పార్లమెంటు సభ్యులు అసరుద్దీన్ ఓవైసీ గారికి వినతి పత్రం అందజేసిన సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ సుర్వి యదయ్య గౌడ్ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి పని చేసిన సర్పంచ్ల పెండింగ్ బిల్లులు మంజూరు కొరకై అనేక మార్లు శాంతియుత గాంధేయ మార్గంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించినను నేటి వరకు సర్పంచుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయక రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ పబ్బం గడుపుతున్న ప్రభుత్వానికి నిరసనగా వినతి పత్రం ఇవ్వడం జరిగినది రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు పెండింగ్ బిల్లులు రాక అయోమయానికి గురవుతూ అనేకమంది సర్పంచుల కుటుంబాలు అప్పుల వారి వేధింపులతో చిన్నాభిన్నం అవుతున్నాయి పెండింగ్ బిల్లులు మంజూరు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరినారు మాజీ సర్పంచ్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే అప్పుల వారి వే ధింపులు భరించ లేక ఆత్మహత్యల బారిన పడే అవకాశం ఉంది బిల్లులు మంజూరు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి అని కోరినారు ఈ కార్యక్రమంలో రాంపాక నాగయ్య సర్పంచ్ ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి కేశబోయిన మల్లయ్య రవీందర్ జేఏసీ రాష్ట్ర కమిటి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ అధికారంలోకి రావాలంటే

**● రేవంత్ సిఎంగా ఉంటేనే మేలు: కవిత**

**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**
తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఒక ఉద్యోగి అని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి ముందు ఆయన ఉద్యోగాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఆమె మీడియాతో చిట్ చాట్ సందర్భంగా, రేవంత్ రెడ్డికి పార్టీ అధినేతల అపాయింట్ మెంట్ దొరక్కట్లేదని తెలియజేశారు. బిఆర్ఎస్ మళ్లీ గెలవాలంటే రేవంత్ రెడ్డి సిఎంగా కొనసాగాలని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం జాగృతి తరపున పోరాటం చేశామని, ఈ నెల 17న మెదక్ లో



బిసి రిజర్వేషన్లపై సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ధర్నాలు, రైల్ రోకోలు, అవసరమైతే బంద్ కు పిలుపు ఇస్తామని, ఎవరూ కోర్టుకు వెళ్లే అవకాశం లేదని సూచించారు. నరేంద్రమోడీని కలిసిన సిఎం రేవంత్ రెడ్డి బిసి బిల్లు గురించి కనీసం అడగలేదని, బిజెపికి కూడా బిసిలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వం దెబ్బతీసేలా పాఠ్యపుస్తకాలు మారుస్తున్నారని, కుమురంభీమ్ చిత్రపటం తొలగించి సైబర్ టవర్స్ ఫొటో ముద్రించారని కవిత మండిపడ్డారు.

## మాజీ ఉపసర్పంచ్, కో ఆప్షన్ సభ్యులు సలీమ్ ను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**బాచుపల్లి వెలుతురు జూన్ 14:**
గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాచుపల్లి మాజీ ఉప సర్పంచ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీంను శనివారం రోజున బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బాచుపల్లిలోని వారి నివాసంలో పరామర్శించారు. సలీమ్ ను పరామర్శించిన వారిలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, స్థానిక నాయకులు ఉన్నారు.

## తొలగించిన ఆంధ్రప్రదేశ్ కు చెందిన 26 బీసీ కులాలను తెలంగాణ బీసీ కులాల్లో చేర్చొద్దు

- బీసీ నేత జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 138 బీసీ కులాలు ఉండేవి.తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరువాత తెలంగాణలో ప్రాంతంలో లేనివిగా భావించి 26 బీసీ కులాలను గత తెరాస ప్రభుత్వం తొలగించిందనీ ఆ తొలగించిన బీసీ కులాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ ఏ ఏ జాబితాలో నుంచి తొలగించారో అదే జాబితాలో చేర్చమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ నాయకులు మరియు అక్కడి బీసీ కులాల ప్రతినిధులు ప్రభుత్వం ద్వారా అడగడం,ఆ వెంటనే బీసీ కమీషన్ పబ్లిక్ హియరింగ్‌కు పిలవడం అంటేనే తెలంగాణ బీసీలకు ద్రోహం తలపెట్టినట్లేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.అభివృద్ధి చెందిన ఆంధ్ర బీసీ కులాలను తెలంగాణ బీసీ జాబితాలో కలపడం వల్ల పీడిత కులాల వారు అన్యాయంకు గురవుతారు.గతంలో తెలంగాణలో ఉన్నటువంటి బీసీ కులాలు సామాజిక,ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికంగా వెనుకబాటు తనానికి గురైన పరిస్థితి ఉంది. ఒకవేళ ఆ కులాల్ని ఇక్కడ చేర్చినట్లైతే ఇక్కడి బీసీ కులాల అభివృద్ధికీ విఘాతం కలిగించే వాళ్లవుతారు.

## ఎమ్మెల్యే వంటమనిషి ఆత్మహత్య

**యాదగిరిగుట్ట,జూన్14( వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో సైదాపురం గ్రామానికి చెందిన రవి (38) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను ఎమ్మెల్యే ఐలయ్య ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తూ పై అంతస్థులోనే ఎన్నో ఏళ్లుగా ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడు రవికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని స్థానికులు తెలిపారు.

https://epaper.velthuru.com

నల్గొండ

వెలుతురు

# బీసీలకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలి

- ప్రభుత్వ పదవులలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- నల్గొండలో దశాబ్దాలుగా బీసీలకు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవటం తీవ్ర అన్యాయం
- సంఘాలను నడుపుతున్న నాయకులు బానిస సంకెళ్లు తెంచుకోవాలి
- జూలై నెలలో నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం
- బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**దేవరకొండ వెలుతురు జూన్ 14:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం దేవరకొండ ఐబి అతిథి గృహంలో బీసీ పొలిటికల్ యువజన జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి రాచాల యుగంధర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందకపోయినా పార్టీ తరపున టికెట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, కానీ ఆచరణలో సాధ్యం కాదన్నారు. కేవలం ఒక అధికార పార్టీ మాత్రమే టికెట్లు ఇస్తే సరిపోదని, అలా చేస్తే ప్రతిపక్ష పార్టీలో బలమైన నాయకుడు బరిలో ఉంటే బలయ్యేది బీసీ సామాజిక వర్గం నాయకులే అని అన్నారు. బీసీలపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా... ఆర్డినెన్స్ తెచ్చి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఇటీవల కాలంలో పార్టీ పదవుల్లో బీసీలకు అధికంగా ప్రాధాన్యం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ ప్రభుత్వ, నామినేటెడ్ పదవుల్లో మాత్రం బీసీలకు తీరని అన్యాయం చేశారని, కష్టపడేది ఎస్సీ, ఎస్టీ, బీసీలు... పదవులు అనుభవించేది మాత్రం అగ్రవర్ణాలా? అని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల నుంచి నల్లగొండ జిల్లాలో బీసీలకు ఒక్క మంత్రి పదవి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాలో మూడు దశాబ్దాలుగా బీసీ సంఘాలను నడుపుతున్న నాయకులు ఒక్క మంత్రి పదవి కూడా తీసుకురాలేకపోయారని, ఇంకా ఎన్నిరోజులు అగ్రవర్ణాల బానిస సంకెళ్లలో నలిగిపోతారని హితవు పలికారు. బీసీ సంఘాల నాయకులు ఆత్మ విమర్శ చేసుకొని సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లాలో మే 28న 20వేల మందితో జనభేరి బహిరంగ సభ నిర్వహించి బీసీల సత్తా చాటామని, జూలై నెలలో నల్గొండలో కూడా కనీవినీ ఎరుగని రీతిలో 30 వేల మందితో బిసి సభ నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. త్వరలో నియమించే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించి, మంత్రి పదవి కూడా ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# విద్యార్థుల కు భవిష్యత్తు విద్య ఒకటే

- విద్యా పేదవాడి ఆయుధం ఆర్ కృష్ణయ్య





**హైదరాబాద్ వెలుతురు జూన్ 14:**
బి సి టి ఏ ఆధ్వర్యంలో శనివారం రోజున స్టాన్లీ ఆడిటోరియం నందు మహాత్మ జ్యోతిరావు పూలే ప్రతిభా పురస్కారాలు హైదరాబాదు జిల్లా అన్ని ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన 180 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, గౌరవ రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, గౌరవనీయులు పెద్దలు ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య విద్యార్థులకు మెడల్స్ ప్రశంసా పత్రాలు అందించడం, ప్రధానోపాధ్యాయులకు లేదా సీనియర్ ఉపాధ్యాయులకు సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా ఆర్ కృష్ణ అన్న గారు మాట్లాడుతూ పేద పిల్లలకు సన్మానం చేయడం బి సి టి ఏ సంఘాన్ని ప్రశంసిస్తూ ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేయాలని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కష్టపడి చదివి సమాజంలో ఒక గొప్ప స్థాయిలో ఉండాలని, మీకు చదువు మాత్రమే అన్ని ఇస్తుంది చదువు లేకపోతే మనిషి ఏమి సాధించలేడు ఏదైనా సాధించాలంటే కష్టపడి చదవాలని పేదరికం చదువుకి అడ్డంకి కాదని ఏ విద్యార్థి అయినా ఏ ఇబ్బంది వచ్చినా నేనున్నానని విద్యార్థుల్లోకానికి భరోసా ఇచ్చాడు, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చాలా ధైర్యవంతులు ఏ సమస్య వచ్చినా ఎదుర్కొనే సత్తా ఈ విద్యార్థులు కలదని ఇక్కడ వేదిక మీద ఉన్న అందరు కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని పైకి వచ్చినవారే కాబట్టి మీరు ఏది కావాలనుకున్న చదువు ద్వారా మాత్రమే నెరవేర్చుకోగలుగుతారు అని చెప్పారు,గౌరవ ఎంఎల్సి మల్కా కొమురయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల, విద్యార్థుల సంక్షేమం కోసం పాటుపడతానని ఉపాధ్యాయులందరూ కూడా విద్యార్థులని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయ లోకాన్ని కోరారు, సమస్యల మీద నిరంతరం ప్రభుత్వంతో చర్చించి పరిష్కార మార్గాలు చూపిస్తానని, ఈ కార్యక్రమం నిర్వహించడం నిజంగా అభినందనీయం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సన్మానం చేయడం అభినందనీయం అని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న బి సి టి ఏ అభినందిస్తున్నాను, బి సి డి ఏ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ 33 జిల్లాలో మహాత్మ జ్యోతిరావు పూలే అవార్డ్ లని అన్ని జిల్లాల్లో నిర్వహించాలని అనుకున్నాము ఇప్పటికే చాలా జిల్లాలో నిర్వహించడం జరిగింది భవిష్యత్తులో అన్ని జిల్లాలో నిర్వహిస్తామని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అందరు కూడా పేద విద్యార్థులు వీరిని ఎంకరేజ్ చేయడం వల్ల రాబోయే రోజుల్లో మళ్లీ మేమే మొదట రావాలని ఆలోచన ఇప్పటినుంచే కలగాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం, సావిత్రిబాయి జ్యోతిబాపూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని విద్య అనేది అన్ని వర్గాలకు అందాలి, విద్య ద్వారా మాత్రమే గౌరవ మర్యాదలు లభిస్తాయని, తల్లిదండ్రుల ఆస్తులు మన మంచిగుంటే మిగులుతాయి లేకపోతే ఏవి మన చేతిలో ఉండవు విద్య ద్వారానే అన్ని సాధించుకోగలుగుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఎస్సి పరీక్షల డైరెక్టర్ జనరల్ కృష్ణారావు గారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పకడ్బందీగా పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించడం జరిగింది. అందరూ పరీక్షలు మంచిగా రాసి ఉత్తీర్ణై స్కూల్లో టాప్ మార్కులు తెచ్చుకున్న మీ అందరిని విద్యార్థులను, ఉపాధ్యాయులను, హెడ్మాస్టర్లను, అభినందిస్తున్నానని తెలియజేశారు, బిసిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్, ఎస్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాక్టో చైర్మన్ సదానందంగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని అదేవిధంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నటువంటి బిసిటి రాష్ట్ర జిల్లా కార్యవర్గాన్ని అభినందిస్తున్నానని ప్రభుత్వ పాఠశాల నిలబెట్టుకునే బాధ్యత మనపైనే ఉందని తెలియజేశారు ,హెడ్మాస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జాక్టో ట్రెజర్ హేమచంద్రుడు, బి సి టి ఏ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు బి.సంతోష్ కుమార్ ఆర్. లక్ష్మీ కాంతారావు, రాఘవేందర్ ఇఫ్తాకర్, రామ సుబ్బారావు, సుభాష్, యాదగిరి, బడే సాబ్ జిల్లా రాష్ట్ర నాయకులు పాల్గొనడం జరిగినదిలి





## వర్షాకాల సమయంలో పొలాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి

- ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు జూన్ 14:**
వర్షాకాల సమయంలో పొలాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఇటీవల బేల మండలంలో పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు దుర్మరణం చెందడం బాధాకరమైన విషయమని అన్నారు. శనివారం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహకారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా సైతం అండగా ఉంటామని హామీ ఇచ్చారు, వీరితోపాటు మండల నాయకులు ఇంద్రజిత్ కరుణాకర్ రెడ్డి మురళీధర్ . దత్తానిక్కం సందీప్ రాము నవీన్ మూడేశ్వర్ రాకేష్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

# రజకుల ఉచిత కరెంట్ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- కరెంటోళ్ళ వేధింపులు ఆపాలి
- రజకుల సమస్యలపై 17న ఇందిరాపార్క్ ముందు జరిగే మహాధర్నా జయప్రదం చేయండి



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 14:**
రజక వృత్తిదారుల ఉచిత విద్యుత్ పథకం పెండింగ్ కరెంట్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, కరెంటోళ్ళ వేధింపులు ఆపలని రజాకాల సమస్యలు పరిష్కారంకై 17 న జరిగే ఇందిరా పార్కు ముందు ధర్నాకు రజకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆవనగంటి స్వామి, మండల అధ్యక్షుడు కొండూరి శంకర్ పిలుపునిచ్చారు. స్థానిక రహదారి భవనం ముందు మండల రజక వృత్తిదారుల సంఘం మండల నాయకులతో కలిసి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాపితంగా రజక వృత్తిదారులకు జి.వొ 2ప్రకారం 250యూనిట్లు ఉచిత కరెంటు పథకంతో కనెక్షన్ ఇచ్చి విద్యుత్ శాఖకు ప్రభుత్వం బకాయిలు,చెల్లించకపోవటంతో కరెంటోళ్ళు రజక వృత్తిదారులను వేధింపులకు గురించేస్తున్నారన్నారు. కొన్ని చోట్ల తీగలు కట్ చేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో మోడరన్ దోబీ ఘాట్ నిర్మించి పెండింగ్లో ఉన్న రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని జరిగే మహా ధర్నాకు, మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో హాజరుకావాలని, అన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి సంఘం నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు పొన్న ఉప్పలయ్య, బోనగిరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు అక్కెనపల్లి లింగయ్య, పొట్లచెర్వు నాగయ్య,మంద్ర మల్లేష్, భూపాల్, గోలి స్వామి, భాతారాజు దుర్గయ్య, నెమనంది అంజయ్య, దావనూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగంలో బదిలీలు సహజం, ఎక్కడికి వెళ్ళినా చిత్తశుద్ధితో పనిచేయాలి.

### మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్, ఎస్, శ్యాంసుందర్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 14**
ఉద్యోగం అన్నప్పుడు బదిలీ అనేది సాధారణమని, ఎక్కడ విధులు నిర్వర్తించిన చిత్తశుద్ధి తో పనిచేయాలని, మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్, ఎస్, శ్యాంసుందర్, అన్నారు. శనివారం మందమర్రి జిఎం కార్యాలయంలోనీ కాన్ఫరెన్స్ హాల్లో, ఏర్పాటుచేసిన కార్యక్రమంలో, డిప్యూటీ పర్సనల్మేనేజర్ ఏ, సత్య బోసు, పి, విశ్రాంత్ లు, బదిలీపై వెళ్తున్నందున అధికారులు, సిబ్బంది, జ్ఞాపికలను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించి, డిపార్ట్మెంట్లో వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డి వై పి ఎం, ఆసిఫ్, కార్తీక్, సత్యనారాయణ, వంశీ,ఎం ఎం, రాజలింగు, పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట కోర్టులో 382 కేసులు పరిష్కారం

- లోక్ అధాలత్ ను వినియోగించుకున్న కక్షిదారులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 14:**
రామన్నపేట కోర్టు పరిధిలో మొత్తం 382 కేసులకు పరిష్కారం లభించింది. శనివారం నాడు, రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జ్ జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష లు కలిసి కోర్టు హాల్ లో నేషనల్ లోక్ అధాలత్ ను నిర్వహించారు. రామన్నపేట జ్యుడిషియల్ సంబంధించి రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగుడూరు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 295, ప్రీ లిటికేషన్ కేసులు 02, ఎక్సైజ్ కేసులు 24, ఇతర కేసులు 85 కేసులు పరిష్కరించుకున్నారు. అనంతరం జడ్జీ మాట్లాడుతూ, క్షణిక ఆవేశాలతో, అప్పటి పరిస్థితులలో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ, డబ్బులు, సమయం వృధా చేసుకోవడం బదులు రాజమార్గమే, యాజమార్గంగా కోర్టు పరిధిలో నిర్వహించే లోక్ ఆధాలత్ వినియోగించుకొని సమస్యలు, పరిష్కరించుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని, తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు, వివిధ పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించిన కందిమల్ల గోపాల్ రెడ్డి

- కందిమల్ల యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 14:**
మండలం నీర్నంల గ్రామానికి చెందిన సుర్వి. స్వామి(వాటర్ ప్లాంట్),అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న కందిమల్ల యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కందిమల్ల గోపాల్ రెడ్డి స్వామి కుటుంబాన్ని పరామర్శించి, పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించినారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆవుల నరసింహ. మండల నాయకులు చల్ల సత్య ప్రకాష్, మాజీ వార్డ్ నెంబర్ నాగాటి మహేష్, యువజన నాయకులు సుర్వి శివకుమార్, చిప్పలపల్లి రామచంద్రం, బెల్లం సత్తయ్య, ముత్యాల శివ, చల్లా ఆనంద్,చల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించిన ఇంద్రపాలనగరం బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గర్దాసు విక్రమ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 14:**
ఇంద్ర పాలనగరం గ్రామానికి చెందిన గర్దాస్ సత్తయ్య( పద్మశాలి) గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ, మరణించడం జరిగింది. మృతుని కుటుంబానికి స్థానిక బిఆర్ఎస్ నాయకులతో, కలిసి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించిన ఇంద్రపాలనగరం యువ నాయకులు గర్దాస్ విక్రమ్. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు రాస వెంకటేశం, గర్దాసు కర్ణాకర్, రవ్వ నరసింహ,సింగన బోయిన దశరథ, సింగన బోయిన పగడాల మాంటి, లింగస్వామి, మల్లేశం, వెంకటేశం, సత్యనారాయణ, గొల్లపల్లి యాదయ్య, గర్దాసు శ్రీకాంత్, మహేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయం నందు మూడవ వార్షికోత్సవం కార్యక్రమం.



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 14:**
అయ్యప్ప స్వామి దేవాలయం నందు మూడవ సంవత్సర వార్షికోత్సవం జరుపుకోవడం జరిగింది. ఇందులో భాగంగా హెూమం, మరియు గణపతి పూజ, మరియు అయ్యప్ప అభిషేకం మరియు, అన్నదానం చేయడం జరిగింది. ఇందులో భైరవేణి లక్ష్మణ్ చైర్మన్ ఆధ్వర్యంలో జల శేఖర్ రెడ్డి, మూట గోపాల్, జెల్లా వెంకటేశ్వర్లు, బాకూరి మల్లికార్జున్, బాకూరి శివ, కడారు మల్లేష్, బాలగోని శివ, బాలగోని రామ్, ఆర్ శివరాజ్, నూకల రమేష్, గోగు ప్రవీణ్, పల్లె విజయ్, గంగాపురం నవీన్, బాబు చారి, శశిపంతులు ఆధ్వర్యంలో పూజలు ఘనంగా, నిర్వహించడం జరిగింది.

https://epaper.velthuru.com

హైదరాబాద్ వెలుతురు

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతా

- ఇసుక అక్రమ రవాణా చేస్తే కోరుకునేదే లేదు.
- ఇసుక ద్వారా వచ్చే రాయల్టీ నిధులతో, రాష్ట్రంలో మరింత అభివృద్ధి చేస్తా.
- కార్మిక, ఉపాధి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి.



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 14**

రాష్ట్రంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, ఇకపై ఉక్కు పాదం మోపుడేనని, కార్మిక, ఉపాధి, మైనింగ్ శాఖ మంత్రి, వివేక్ వెంకటస్వామి అన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, మొట్టమొదటిసారిగా మంచిర్యాల జిల్లాలోని తన నియోజకవర్గమైన చెన్నూరుకు రావడంతో, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ఇందారం వద్ద భారీ ఎత్తున బ్యాండ్ మేళాలతో, డీజే పాటలతో, స్వాగతం పలికి, బాణసంచా కాల్చి, భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా జరుగుతే, చూస్తూ ఊరుకునేది లేదని, ఇప్పటివరకు అక్రమంగా ఇసుకను తరలించేవారు ఎవరైనా ఉంటే, ఇక నుండి మానుకోవాలని, లేదంటే ఉక్కు పాదం మోపుడేనని ఆయన వేలాదిమంది మధ్యలో హెచ్చరించారు. నిజాయితీగా పనిచేస్తాడని నమ్మకంతోనే పార్టీ అధిష్టానం, తనకు మైనింగ్ శాఖను అప్పగించిందని, అప్పగించిన బాధ్యతను తూచా తప్పకుండా నిర్వర్తిస్తానని, ఇసుక ద్వారా వచ్చే రాయల్టీ నిధుల ద్వారా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహాయ సహకారాలతో, ఎక్కడ కూడా అవకతవకం లేకుండా అక్రమాలకు తావివ్వకుండా, రాష్ట్రంలో మరింత అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. ఇప్పటివరకు చేసిన అభివృద్ధి కాక, చెన్నూరు నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, నేను మంత్రి అయిన ఎప్పుడు మీతోనే ఉంటానని మీకోసమే పని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉదయం 10 గంటల నుండి ఇందారం నుండి చెన్నూరు, రామకృష్ణాపూర్, మందమర్రి వరకు సాయంత్రం ఐదు గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ కార్యకర్తలను, అభిమానులను, కలుస్తూ నిర్విరామంగా పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు నాయకులకు ప్రభుత్వ అధికారులకు, పోలీస్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు



## కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి.


వటువర్లపల్లి మాజీ సర్పంచ్ యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ చత్రు నాయక్




**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ జూన్ 14:**

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి భేషరతుగా క్షమాపణ చెప్పాలని ... అనుచిత వ్యాఖ్యలు చేసిన అనుదీప్ గుప్తా పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి మాజీ సర్పంచ్, యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శత్రు నాయక్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని అచ్చంపేట పట్టణంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఏఐసీసీ యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ రూపేష్ సింగ్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు అచ్చంపేట పట్టణంలోని పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశామని ఆయన తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం పై అవాకులు చెవాకులు మాట్లాడితే సహించేది లేదన్నారు. రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగా వస్తున్న స్పందన చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కుంద మల్లికార్జున్ , మున్సిపల్ కౌన్సిలర్ గౌరీ శంకర్,యూత్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, పవన్ ,ఖాదర్, రఫీ, కృష్ణ, రాజగోపాల్, జబ్బు వెంకటేష్,బలరాం, శ్రీను నాయక్ , వినోద్, యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లమల అడవుల్లో సఫారీ పర్యటకులకు కనువిందు చేస్తున్న పెద్ద పులులు



**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ జూన్ 14:**

నల్లమల అటవీ అభయారణ్యంలో ఫరహాబాద్ వ్యూ పాయింట్ సమీపంలో నిజాం నవాబు బంగ్లా వద్ద సఫారీ పర్యాటకులకు తరచూ కనువిందు చేస్తున్న పెద్ద పులులు పర్యటకులు పెద్ద పులులను చూసి తరించబోతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం శనివారం ఉదయం పరహాబాద్ సమంలోని నిజాం నవాబు బంగ్లా వద్ద సఫారీ లో ప్రయాణ%శీ% చేస్తున్న పర్యాటకులకు పెద్దపులి కనిపించడంతో వారు తమ వద్ద ఉన్న చరావాణిలో పులి సంచారాన్ని చిత్రీకరించి ఇతరులకు అట్టి విషయాన్ని తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పర్యటకులు ఫారెస్ట్ పర్యటనకు వెళ్ళినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అదేవిధంగా అటవీ సమీప గ్రామాల ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు కోరుతున్నారు.

## సహాయ ఉపకరణాల కొరకు దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 14**

అర్హులైన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మహిళ-శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి రౌఫఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ, తెలంగాణ వికలాంగుల సహాయక సమితి ద్వారా జిల్లాలోని ప్రతి దివ్యాంగుడికి సహాయ ఉ పకరణాలు పంపిణీ చేయడం జరుగుతుందని, జిల్లాకు 45 రెట్రోఫిట్మెంట్ స్కూటీలు, 14 బ్యాటరీ వీల్ చైర్స్, 18 మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిళ్లు, 1 బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికల్, 5 హైబ్రిడ్ వీల్ చైర్లు, 14 ల్యాప్ టాప్స్ (డిగ్రీ విద్యార్థులకు), 7 ల్యాప్టాప్స్ (ఉన్నత సాంకేతిక విద్య), 22 టాబ్స్, 2 5జి స్మార్ట్ ఫోన్, 11 చేతి కర్రలు, 3 వీల్ చైర్లు, 1 చెవిటి మిషన్, 6 ట్రై సైకిల్లు, 6 వీల్ చైర్స్, 23 క్రచెస్, 2 చెవిటి మిషన్లు, 23 వాకింగ్ స్టిక్స్, 11 స్మార్ట్ కేన్స్, 11 ఎం. సి. ఆర్. చెప్పల్ మంజూరయ్యాయని తెలిపారు. అర్హత కలిగిన వికలాంగులు ఆన్లైన్లో https://tgobmms.cgg gov.in లో ఈ నెల 18వ తేదీలోగా పూర్తి వివరాలతో జాగ్రత్తగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు హెల్ప్ లైన్ నం. 155326 లో సంప్రదించాలని, అర్హత గల దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పదేళ్ల తరవాత మళ్లీ సినీ సంబరం

**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**

గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక అట్టహాసంగా జరిగింది. హైదరాబాద్ లోని హైటెక్స్లో వేదికగా జరుగుతోన్న ఈ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర సినిమాటోగ్రఫి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంది అవార్డులు ఇవ్వగా 2014 నుంచి ఆ పక్రియ ఆగిపోయింది. మళ్లీ 10 ఏండ్ల తర్వాత ఇప్పుడు గద్దర్ అవార్డ్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పురస్కారాలను అందిస్తోంది. 2014 నుంచి 2024 వరకు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన సినిమాలకు, నటు-లు, దర్శకులు, టె-క్నిషియన్లకు ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేసింది.

## మంచిర్యాల జిల్లా, టి డబ్ల్యూ జె ఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 14**



మంచిర్యాల జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్,( టిడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గాన్ని, శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని, మంచిర్యాల గార్డెన్స్ లో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే బసవ పున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి చంద్రశేఖర్, హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అధ్యక్షులుగా తోట మల్లేష్ యాదవ్, కార్యదర్శిగా చింతకింది మధుసూదన్, (ఆంధ్రప్రభ), ఉపాధ్యక్షులుగా చుంచు చందు ( వార్త), అరికెళ్ల జీవన్ బాబు (బీసీఎన్ ఛానల్), గొర్రె లక్ష్మణ్ (ఎస్ ఎల్ ఎన్ న్యూస్ ఛానల్), సంయుక్త కార్యదర్శిగా బుద్దే రవికుమార్ (వార్త), ఇప్ప రాజ్ కుమార్ (షెణార్తి మీడియా), కోశాధికారి క్యాతం రాజేష్ (నేటి వార్త), జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ముత్యం వెంకటస్వామి (విజయ క్రాంతి), రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా భూపతి సత్తయ్య ( వార్త), మేకల ప్రభాకర్ (మన తెలంగాణ), ఆవిడపు వెంకటేష్ (నవ తెలంగాణ), సభ్యులుగా ఎం శేఖర్ (శణార్థి తెలంగాణ), జాడి వెంకటయ్య (నవ తెలంగాణ), నేరెళ్ల సంతోష్ గౌడ్ (నేటి ధాత్రి), కే, రామాచారి (నవభూమి) ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను, రాష్ట్ర నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది..

# టీ డబ్ల్యూ జె ఎఫ్ మాత్రమే..

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బి. బసవపున్నయ్య.



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 14**

జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడేది, టీడబ్ల్యూజేఎఫ్ సంఘం మాత్రమేనని, ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, బి, బసవపున్నయ్య అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా మూడవ మహాసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, జర్నలిస్టుల కనీస సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, కొత్త సంవత్సరం వచ్చి ఆరు నెలలు కావస్తున్న, అక్రీడిటేషన్ కార్డులకు గడువు పెంచుతూ, స్టికర్లు వేస్తూ కాలం వెళ్ళదీస్తున్నారని అన్నారు. పేరుకు హెల్త్ కార్డులు ఇచ్చారని, అవి పనిచేయడం లేదని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు తదితర సమస్యలపై సంఘం అవిశ్రాంత ఉద్యమాలు చేస్తున్నదని గుర్తు చేశారు. ప్రస్తుతం జర్నలిస్టులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని, చిన్న పత్రికల పరిస్థితి మరీ దారుణంగా ఉందని అన్నారు. సంఘ సభ్యుల0దరూ ఐక్యమత్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం తగదని, దీర్ఘకాళికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదని,జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ, సమస్యల పై సమిష్టి పోరాటానికి జర్నలిస్టులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ ఉపాధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## జగన్‌తో మిలాఖత్ అయి

# కృష్ణా జలాల దోపిడీ

- కృష్ణాజలాల వాటాను కేవలం 299 టిఎంసిలకే పరిమితం
- పదేళ్లలో దోచిపెట్టిన ఘనులు బిఆర్ఎస్ పాలకులు
- బనకచర్లపై మేము అప్రమత్తంగానే ఉన్నాం
- హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,జూన్14( వెలుతురు ):**

నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది ఆర్ఎస్ పార్టీనే అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కృష్ణానది వాటాను కేవలం 299 టిఎంసిలకే పరిమితం చేశారని.. బిఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదని ప్రశ్నించారు. ఎపి రోజూ 3 టిఎంసిలు మళ్లిస్తుంటే కెసిఆర్ చోద్యం చూశారని.. జగన్, కెసిఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టారని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తోసిపుచ్చారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నాం. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశాను. ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపాను. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదు. చట్టపరంగా ముందుకెళు_న్నాం. హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని మండిపడ్డారు. నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్సేనని ఆరోపించారు. పదేళ్ల పాలనా కాలంలో కృష్ణానది వాటాను కేవలం 299 టీఎంసీలకే పరిమితం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదు. ఏపీ..రోజూ 3 టీఎంసీలు మళ్లిస్తోంటే కేసీఆర్ చోద్యం చూశారు. జగన్, కేసీఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఇవన్నీ కప్పిపుచ్చి బనకచర్ల ప్రాజెక్టు గురించి బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ఆరోపణలను చేయడాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తోసిపుచ్చారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నామని ఆయన అన్నారు. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశానని.. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపినట్లు- పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదని.. ప్రాజెక్టుపై చట్టపరంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ విషయంలో హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఉత్తమ్ మండిపడ్డారు.

## అయోధ్యలో రామదర్బార్ దర్శనం

- భక్తులకు అనుమతించిన ట్రస్ట్



**అయోధ్య,జూన్14(ఆర్ఎన్ఎ):**

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం మొదటి అంతస్తులో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం తొలిసారిగా భక్తుల సందర్శనకు అనుమతిస్తున్నారు. శనివారం నుంచి భక్తులను రామ దర్బార్ సందర్శనకు అనుమతించాలని ట్రస్ట్ నిర్ణయం తీసుకుంది. దీంతో శనివారం సాయంత్రం 5-7, 7-9 గంటల మధ్య రెండు స్లాట్లలో రామ దర్బార్‌ను సందర్శించేందుకు పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించాలని నిర్ణయించిట్లు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు అనిల్ మిశ్రా తెలిపారు. రామదర్బార్ ప్రతిష్ఠాపన జూన్ 5వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 1.25 నుంచి 1.40 గంటల మధ్య అభిజిత్ ముహూర్తంలో జరిగింది. రామాలయంలోని మొదటి అంతస్తులో రాముడు, సీత, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, హనుమంతుడితో కూడిన రామదర్బార్ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. వీటితోపాటు- ఆలయ ప్రాంగణంలో మరో ఏడు దేవాలయాల్లో విగ్రహాల ప్రాణప్రతిష్ఠ జరిగింది. రామ్‌లల్లా దర్శనం తరహాలోనే రామదర్బార్ దర్శనానికీ పాసులు జారీ చేస్తున్నామని అనిల్ మిశ్రా తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒక స్లాట్ ఉంటుందని, ఒక్కో స్లాట్‌కు 300 పాసులు జారీ చేస్తామని చెప్పారు. ఉదయం 7-9, 9-11, మధ్యాహ్నం 1-3, 3-5, సాయంత్రం 5-7, 7-9 వరకూ దర్శనం స్లాట్‌లు ఉంటాయని చెప్పారు.

## రక్తదాన ప్రోత్సాహంలో విశేష సేవలు

- పెద్దపల్లి ఎసిపి గజ్జికృష్ణకు మోటివేటర్ అవార్డు
- గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందచేత

**పెద్దపల్లి,జూన్14(ఆర్ఎన్ఎ):**

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా బెస్ట్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు. పెద్దపల్లి ఏసీపీగా గజ్జి కృష్ణ యాదవ్ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు- చేయడంతో పాటు- రక్తదాతలను ప్రోత్సహించడం, ఆయన గతంలో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ- సిఫారసు మేరకు రాజ్ భవన్ వర్గాలు ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ సేవలను గుర్తించి, బెస్ట్ మోటివేటర్ అవార్డుకు ఎంపిక చేయడంతో ప్రజలకు విశేష సేవలు అందించిన పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ శనివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్ కు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఐదో అంతస్థునుంచి దూకి మహిళ ఆత్మహత్య

*కుటుంబకలహాలే కారణమంటున్న పోలీసులు*


**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**

సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రగడ్డలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఓ మహిళ 5వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు- పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం 8:30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం... ఆత్మహత్య చేసుకున్న మహిళ పేరు కొక్కినీ శ్రావణి (30), ఆమె తిమ్మాపురం, ఏలూరు జిల్లా వాసిగా గుర్తించారు. . కొద్ది నెలల క్రితమే హైదరాబాద్‌కు వలసవచ్చి, జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్టు- తెలుస్తోంది. ఆమెకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాలే ఆమె ఆత్మహత్యకు కారణమై ఉంటాయని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు- పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సంఘటనతో అపార్ట్‌మెంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ప్రజల్లో కాంగ్రెస్ పట్టు కోల్పోయిందా? బీఆర్ఎస్ బలంగా మారుతోందా?

-ఒక విశ్లేషణ

**తెలంగాణ రాజకీయాలు ప్రస్తుతం అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవకుండానే కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో కొంత పట్టు కోల్పోతున్న సూచనలు కనిపిస్తుండగా, వరుస కేసులతో సతమతమవుతున్నప్పటికీ, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో మరింత బలంగా రూపుదిద్దుకుంటున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.**



## బీఆర్ఎస్ బలం, కేసీఆర్ ప్రజాదరణ:

### గతం వైభవం

గత దశాబ్ద కాలంలో, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో తిరుగులేని శక్తిగా అవతరించింది. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన పోషించిన కీలక పాత్రతో పాటు, అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన అనేక పథకాలు ప్రజల మన్ననలు పొందాయి. మిషన్ భగీరథ, రైతు బంధు, కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తెచ్చాయి. "కేసీఆర్ ఉంటేనే మేలు జరుగుతుంది" అనే నమ్మకం ప్రజల్లో లోతుగా నాటుకుపోయింది. ఎన్నో అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల రూపురేఖలను మార్చాయి. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే అధికారులు, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే యంత్రాంగం అప్పట్లో ప్రభుత్వానికి పెద్ద బలంగా నిలిచింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయం సాధించారు.

## మలుపు తిరిగిన చక్రం:

### కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత?

అయితే, 2023 ఎన్నికల ఫలితాలు రాజకీయ చిత్రాన్ని మార్చేశాయి. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ప్రజలను ఆకట్టుకుని అధికారంలోకి వచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎందుకు మారింది? గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందుబాటులో ఉన్న అధికారులు, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఎందుకు దూరం జరుగుతున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు కాంగ్రెస్ వైఫల్యంలోనే ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### హామీల అమలులో జాప్యం, లోపాలు:

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ముఖ్యంగా రైతు భరోసా (రైతులకు రూ.15,000 ఆర్థిక సహాయం), ఇందిరమ్మ ఇండ్లు (ఇళ్లు లేని వారికి ఇళ్లు), యువ వికాసం (నిరుద్యోగ భృతి), మహాలక్ష్మి పథకం (మహిళలకు ఆర్థిక సహాయం) వంటి పథకాల అమలులో జాప్యం, నిబంధనలు, అర్హత ప్రమాణాలపై స్పష్టత లేకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. "అవన్నీ ఎన్నికల హామీలేనా?" అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. అనేకమంది అర్హులైన వారికి కూడా పథకాల లబ్ధి అందకపోవడం, దరఖాస్తు ప్రక్రియలో జాప్యం ప్రజల నిరాశకు కారణమవుతోంది.

### అధికార యంత్రాంగంపై పట్టు కోల్పోవడం:

గత ప్రభుత్వంలో సీఎం కార్యాలయం నుండి క్రింది స్థాయి వరకు ఒక పటిష్టమైన యంత్రాంగం పనిచేసేది. అధికారులంతా ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించేవారు. కానీ, ప్రస్తుతం అధికార యంత్రాంగంపై ప్రభుత్వానికి సరైన పట్టు లేదనే వాదన బలంగా వినిపిస్తోంది. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల గురించి సరైన అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు అదృశ్యమయ్యారని ప్రజలు భావిస్తున్నారు.

### అంతర్గత కలహాలు, సమన్వయ లోపం:

కాంగ్రెస్ పార్టీలో తరచుగా బయటపడుతున్న అంతర్గత కలహాలు, నాయకుల మధ్య సమన్వయ లోపం ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లడానికి ప్రధాన కారణమవుతున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు, పార్టీ నాయకుల మధ్య పూర్తి స్థాయి సమన్వయం లేకపోవడం పరిపాలనపై ప్రభావం చూపుతోంది. ఇది ఒక బలమైన, ఏకమైన నాయకత్వం లేదనే సంకేతాన్ని ప్రజలకు పంపుతోంది.

### పాలనపై పట్టు లేకపోవడం:

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, పాలనా వ్యవహారాలపై పూర్తి స్థాయి పట్టు సాధించడంలో కాంగ్రెస్ వెనుకబడిందనే అభిప్రాయం ఉంది. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం, ప్రజల సమస్యలపై సకాలంలో స్పందించలేకపోవడం వంటివి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి.

## బీఆర్ఎస్ పుంజుకోవడానికి కారణాలు

కాంగ్రెస్ వైఫల్యాలను బీఆర్ఎస్ తనకు అనుకూలంగా మలుచుకుంటున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

### ప్రభుత్వ వైఫల్యాలపై దూకుడుగా విమర్శలు:

బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై దూకుడుగా విమర్శలు చేస్తూ, ప్రజల్లో అసంతృప్తిని రాజేస్తున్నారు. తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజలకు తిరిగి గుర్తు చేస్తున్నారు.

### కేసీఆర్ ఇమేజ్:

అధికారంలో లేనప్పటికీ, కేసీఆర్ ఇప్పటికీ ప్రజల్లో బలమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన వ్యూహాత్మక ప్రసంగాలు, ప్రజల సమస్యలపై ఆయన స్పందించే తీరు బీఆర్ఎస్ కు తిరిగి బలాన్ని చేకూరుస్తున్నాయి.

### క్యాడర్ బలం:

బీఆర్ఎస్ కు బలమైన, సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న క్యాడర్ బలం ఉంది. ఈ క్యాడర్ ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్తూ, పార్టీని బలోపేతం చేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తోంది.

### సానుభూతి :

అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నాయకులపై నమోదైన కేసులు కొంతమంది ప్రజల్లో సానుభూతిని కూడా పెంచుతున్నాయని చెప్పొచ్చు.

ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే, తెలంగాణ ప్రజలు ఒక స్థిరమైన, ప్రజలకు అందుబాటులో ఉండే, తమ హామీలను నిలబెట్టుకునే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని స్పష్టమవుతోంది. కాంగ్రెస్ తన వైఫల్యాలను సరిదిద్దుకోలేకపోతే, ప్రజల అంచనాలను అందుకోలేకపోతే, బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో మరింత బలంగా అవతరించడం

**కేసీఆర్ రాజకీయ ప్రస్థానం** – వివరణాత్మక పరిశీలన కేసీఆర్ రాజకీయ ప్రస్థానం చాలా సుదీర్ఘమైనది, వ్యూహాత్మకమైనది.

### కాంగ్రెస్ పార్టీలో ప్రవేశం:

ఆయన రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతో ప్రారంభమైంది.

### తెలుగుదేశం పార్టీ (టీడీపీ)లోకి:

తరువాత ఎన్.టి.రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీలో ఆయనకు ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కు దగ్గరి వ్యక్తిగా, మంచి వాగ్ధాటి గల నేతగా పేరు వచ్చింది. ఆయన సిద్దిపేట నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా చాలా సార్లు గెలిచారు. టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేశారు (రవాణా మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్).

### తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) స్థాపన:

2001లో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ నుండి బయటకు వచ్చి తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస)ని స్థాపించారు. ఇది ఆయన రాజకీయ జీవితంలో ఒక కీలక మలుపు.

### తెలంగాణ ఉద్యమం:

టీఆర్ఎస్ స్థాపించిన తర్వాత, ఆయన తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించారు. తెలంగాణ ప్రజల సెంటిమెంట్‌ను సమర్థవంతంగా రగిలించారు. 2004లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి కేంద్ర మంత్రిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో జాప్యం జరగడంతో, ఆయన 2006లో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు.

### ఆమరణ నిరాహార దీక్ష:

2009లో ప్రత్యేక తెలంగాణ కోసం ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ దీక్షే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసిందని చాలామంది భావిస్తారు.

### తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు:

2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు.

## ముఖ్యమంత్రిగా కేసీఆర్ - కీలక నిర్ణయాలు, పరిపాలన ముఖ్యమంత్రిగా కేసీఆర్ పరిపాలనలో కొన్ని ప్రధాన అంశాలు:

### సంక్షేమ పథకాల అమలు:

పైన పేర్కొన్న రైతు బంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు ఆయన పరిపాలనలో ప్రధానాంశాలు. ఇవి ప్రజల మద్దతును గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించాయి.

### సాగునీటి ప్రాజెక్టులు:

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తెలంగాణ ప్రజల ఆకాంక్షగా భావించి, దీనిని ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా పూర్తి చేశారు. ఇది తెలంగాణలోని అనేక జిల్లాలకు సాగునీరు అందించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కూడా మరో పెద్ద ప్రాజెక్టు.

### విద్యుత్ సరఫరా:

తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో విద్యుత్ కొరత తీవ్రంగా ఉండేది. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నిరంతరాయ విద్యుత్ సరఫరాను సాధించింది, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించడం ఒక పెద్ద విజయం.

### పారిశ్రామిక అభివృద్ధి:

టీఎస్-ఐపాస్ (TS-iPASS) వంటి నూతన పారిశ్రామిక విధానాలను ప్రవేశపెట్టి, పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నించారు. హైదరాబాద్‌లో ఐటీ, ఫార్మా రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు.

### గ్రామీణ, పట్టణ అభివృద్ధి:

పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాలతో గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి నిధులు కేటాయించి, స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి ప్రయత్నించారు.

### పోలీస్ వ్యవస్థ బలోపేతం:

శాంతిభద్రతల పరిరక్షణకు, పోలీసు వ్యవస్థను ఆధునీకరించడానికి, బలోపేతం చేయడానికి అనేక చర్యలు తీసుకున్నారు.

## ఎదుర్కొన్న సవాళ్లు, విమర్శలు కేసీఆర్ పరిపాలనపై కొన్ని విమర్శలు, ఆయన ఎదుర్కొన్న సవాళ్లు:

### కుటుంబ పాలన ఆరోపణలు:

కేసీఆర్ కుటుంబ సభ్యులు (కుమారుడు కేటీఆర్, కుమార్తె కవిత, అల్లుడు హరీష్ రావు) ప్రభుత్వంలో, పార్టీలో కీలక పదవుల్లో ఉండటంపై ప్రతిపక్షాలు తరచుగా "కుటుంబ పాలన" అంటూ విమర్శలు గుప్పిస్తుంటాయి.

### నిరుద్యోగ సమస్య:

ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని నిరుద్యోగ యువత నుండి, ప్రతిపక్షాల నుండి విమర్శలు వచ్చాయి.

### ఆర్థిక నిర్వహణ:

రాష్ట్ర అప్పులు పెరిగాయని, సంక్షేమ పథకాలకు భారీగా ఖర్చు చేయడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారం పడిందని ఆర్థిక నిపుణులు, ప్రతిపక్షాలు విమర్శిస్తుంటాయి.

### నియంతృత్వ పోకడలు:

ప్రతిపక్షాలను అణచివేయడం, మీడియాపై ఒత్తిడి, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం లేదని కొన్ని సందర్భాల్లో ఆయనపై విమర్శలు వచ్చాయి.

### ప్రజా సమస్యలపై దూరం:

ముఖ్యమంత్రిగా ప్రజలకు అంతగా అందుబాటులో ఉండటం లేదని, ప్రగతి భవన్‌కే పరిమితమవుతున్నారని విమర్శలు వచ్చాయి.

### కేంద్రంతో సంబంధాలు:

మొదట్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో మంచి సంబంధాలు ఉన్నప్పటికీ, కాలక్రమేణా వాటిలో తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి.

ప్రస్తుత రాజకీయ స్థితిగతులు (జూన్ 2025 నాటికి)

2023 తెలంగాణ శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి – పేరు మార్చుకున్న తర్వాత భారత్ రాష్ట్ర సమితి) అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చేతిలో ఓటమి పాలైంది. ప్రస్తుతం కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు.

### ఓటమికి కారణాలు:

అధికార వ్యతిరేకత, ఉద్యోగ సమస్య, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వంటి హామీల అమలులో జాప్యం, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు, రేవంత్ రెడ్డి నాయకత్వం వంటివి బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

### పార్టీ పునర్నిర్మాణం:

ఓటమి తర్వాత కేసీఆర్ పార్టీని పునర్నిర్మించే ప్రయత్నాల్లో ఉన్నారు. పార్టీ కార్యకలాపాలను తిరిగి వేగవంతం చేసి, ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికలు (2024):

2024 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది, ఇది పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ.

### భవిష్యత్ సవాళ్లు:

రానున్న కాలంలో కేసీఆర్ నాయకత్వానికి, బీఆర్ఎస్ పార్టీకి అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి. ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యలపై పోరాడటం, పార్టీ కేడర్‌ను ఉత్సాహంగా ఉంచడం, భవిష్యత్ ఎన్నికల కోసం పార్టీని సిద్ధం చేయడం వంటివి కీలకమైనవి.

కేసీఆర్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు, ఆయనకు ప్రజల నుండి ఇప్పటికీ గణనీయమైన మద్దతు ఉంది. తెలంగాణకు ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన చేసిన కృషి, కొన్ని సంక్షేమ పథకాలు ఇప్పటికీ ఆయనకు సానుభూతిని నిలబెట్టే అంశాలు. భవిష్యత్‌లో ఆయన రాజకీయ ప్రస్థానం ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## ప్రజల ఆలోచనలో ప్రస్తుత ప్రాధాన్యతలు :

ప్రస్తుతం తెలంగాణ ప్రజల ఆలోచనలో కొన్ని కీలకమైన అంశాలు ప్రముఖంగా ఉన్నాయి:

### హామీల అమలు:

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 'ఆరు గ్యారంటీలు' ప్రజలకు ఎంతవరకు అందుతున్నాయి అనేది మొదటి ప్రాధాన్యత. ఉచిత బస్సు ప్రయాణం వంటివి ఇప్పటికే ప్రజలకు ఉపశమనం కలిగించగా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళు వంటి ఇతర హామీల అమలు తీరుపై నిశిత పరిశీలన ఉంటుంది.

### నిరుద్యోగ సమస్య:

యువతకు ఉద్యోగ కల్పన అనేది చాలా పెద్ద సమస్య. ఏ పార్టీ ఈ విషయంలో మెరుగైన పరిష్కారం చూపుతుందో, ఉద్యోగ నోటిఫికేషన్లు ఎంత వేగంగా వస్తాయో అనేది కీలక అంశం.

### సంక్షేమం VS అభివృద్ధి:

బీఆర్ఎస్ సంక్షేమంపై ఎక్కువ దృష్టి పెట్టింది, కాంగ్రెస్ కూడా సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇస్తోంది. అయితే, కేవలం సంక్షేమంతో సరిపోతుందా, లేక పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కూడా సమాంతరంగా జరగాలా అనేది ప్రజలు ఆలోచిస్తారు. ఏ పార్టీ ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధిస్తుందో చూస్తారు.

### అవినీతి రహిత పాలన:

గత ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు, ప్రస్తుత ప్రభుత్వంపై వచ్చే ఆరోపణలను ప్రజలు గమనిస్తారు. మరింత పారదర్శకమైన, అవినీతి రహిత పాలనను ఏ పార్టీ అందిస్తుందనేది ఒక ముఖ్యమైన అంశం.

### ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ:

ప్రతిపక్షాలకు, ప్రజలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఎంతవరకు ఉంది, ప్రభుత్వం ఎంతవరకు ప్రజలకు అందుబాటులో ఉందనేది కూడా పరిశీలిస్తారు.

### కేంద్రంతో సంబంధాలు:

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహకారం చాలా ముఖ్యం. రాష్ట్ర పార్టీలు కేంద్రంతో ఎలాంటి సంబంధాలను కలిగి ఉంటాయనేది కూడా ప్రజలు ఆలోచిస్తారు.

### భవిష్యత్తు ఊహా పరికల్పన:

## భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాలు ఈ క్రింది విధంగా రూపుదిద్దుకోవచ్చు:

### కాంగ్రెస్ పనితీరు కీలకం:

### సానుకూల దృశ్యం:

కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీలను సమర్థవంతంగా, వేగంగా అమలు చేయగలిగితే, ముఖ్యంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి గణనీయమైన చర్యలు తీసుకుంటే, ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొంటుంది. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా అభివృద్ధిని సమానంగా విస్తరించగలిగితే, కాంగ్రెస్ దీర్ఘకాలం అధికారంలో ఉండే అవకాశం ఉంటుంది. ఇది ప్రజలు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రత్యక్ష ప్రయోజనం పొందుతూ, తమ జీవితాల్లో మార్పును చూస్తున్నారని భావించేలా చేస్తుంది.

### ప్రతికూల దృశ్యం:

హామీల అమలులో జాప్యం లేదా పూర్తిగా వైఫల్యం, ఆర్థిక భారం పెరిగి అభివృద్ధి కుంటుపడటం, కొత్త సమస్యలు తలెత్తడం వంటివి జరిగితే కాంగ్రెస్ పట్ల ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుంది. ఇది ప్రతిపక్షాలకు (ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీ) తిరిగి పుంజుకోవడానికి అవకాశం కల్పిస్తుంది.

### బీఆర్ఎస్ పునర్నిర్మాణం:

### సానుకూల దృశ్యం:

ఓటమి తర్వాత బీఆర్ఎస్ (బిఆర్ఎస్) ఆత్మపరిశీలన చేసుకొని, పార్టీని పూర్తిగా పునర్నిర్మించుకోవాలి. కేసీఆర్ తెరమరుగై, కేటీఆర్ లేదా హరీష్ రావు వంటి యువ నాయకత్వం పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసి, కొత్త ఎజెండాతో ముందుకు వస్తే తిరిగి పుంజుకోవచ్చు. ప్రజలు గతంలో బీఆర్ఎస్ చేసిన మంచి పనులను (రాష్ట్ర సాధన, మిషన్ భగీరథ వంటివి) గుర్తుంచుకొని, ప్రస్తుత ప్రభుత్వ లోపాలను గమనించి తిరిగి బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వొచ్చు.

### ప్రతికూల దృశ్యం:

పార్టీలో అంతర్గత కలహాలు, నాయకత్వ సమస్యలు, ప్రజల సమస్యలపై బలమైన పోరాటం చేయకపోవడం వంటివి జరిగితే బీఆర్ఎస్ మరింత బలహీనపడే అవకాశం ఉంది. దీని వల్ల పార్టీలోని కొందరు నాయకులు ఇతర పార్టీల్లోకి వెళ్లే అవకాశం కూడా ఉంటుంది.

## బీజేపీ పాత్ర:

### శక్తివంతమైన ప్రతిపక్షంగా:

తెలంగాణలో బీజేపీ క్రమంగా బలం పుంజుకుంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం లోపాలను ఎత్తి చూపడంలో, బీఆర్ఎస్ పతనంతో ఏర్పడిన శూన్యాన్ని భర్తీ చేయడంలో బీజేపీ కీలక పాత్ర పోషించవచ్చు. కేంద్రంలో అధికారంలో ఉండటం బీజేపీకి ఒక బలం.

### త్రిముఖ పోటీ:

భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీగా మారే అవకాశం ఉంది. ఇది ప్రజలకు ఎక్కువ ఎంపికలను అందిస్తుంది, ఏ పార్టీ బాగా పని చేస్తుందో దానిని ఎంచుకునే అవకాశం ఉంటుంది.

### ప్రాంతీయ సెంటిమెంట్ VS అభివృద్ధి:

తెలంగాణ రాష్ట్ర సాధన సెంటిమెంట్ బీఆర్ఎస్‌కు ఒకప్పుడు పెద్ద బలం. అయితే, కాలక్రమేణా ప్రజలు కేవలం సెంటిమెంట్‌తో కాకుండా, తమ దైనందిన జీవితాలను ప్రభావితం చేసే అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగ అవకాశాల వంటి అంశాలపై ఎక్కువ దృష్టి పెడతారు.

## భవిష్యత్తులో, ఏ పార్టీ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను (ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, ఉపాధి) మెరుగ్గా తీర్చగలుగుతుందో, దానికే ప్రజల మద్దతు లభిస్తుంది. ముగింపు:

ప్రజల ఆలోచన ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. ఇది ప్రభుత్వాల పనితీరు, హామీల అమలు, ఆర్థిక పరిస్థితి, కొత్తగా వచ్చే సమస్యలు, ప్రతిపక్షాల బలం వంటి అనేక అంశాలపై ఆధారపడి మారుతూ ఉంటుంది. తెలంగాణలో ప్రజలు ఇప్పుడు ఒక మార్పును కోరుకున్నారు. కాంగ్రెస్ ఈ అవకాశాన్ని ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటుంది, బీఆర్ఎస్ తమ తప్పుల నుండి ఎంతవరకు గుణపాఠం నేర్చుకుంటుంది, బీజేపీ ఎలా బలపడుతుంది అనే అంశాలు భవిష్యత్ రాజకీయాలను నిర్ణయిస్తాయి.

భవిష్యత్తులో తెలంగాణ ప్రజలు మరింత సంక్షేమాన్ని, స్థిరమైన అభివృద్ధిని, మెరుగైన ఉపాధి అవకాశాలను, పారదర్శకమైన, జవాబుదారీ పాలనను కోరుకుంటారు అనడంలో సందేహం లేదు. ఈ అంశాలను ఏ పార్టీ సమర్థవంతంగా అందిస్తుందో, ఆ పార్టీకే ప్రజల సానుభూతి, మద్దతు ఉంటుంది. నిజంగానే ఏం జరుగుతుందో వేచి చూడాలి.



అంబటి తిరుపతి గౌడ్

## తల్లులకు చేకూర్చే లబ్ది చూసి ఓర్వలేకే వైసిపి విషప్రచారం చేస్తుంది

- మండిపడ్డ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి జూన్ 14, ( వెలుతురు)**

తల్లులకు చేకూర్చే లబ్ది చూసి ఓర్వలేకే వైసిపి విషప్రచారం చేస్తుందని ఎపి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. పాఠశాలలు తెరచిన రోజే పుస్తకాలు, నాణ్యమైన విద్యా కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తల్లికివందనం కింద ఒక్కరోజులో విద్యార్థులకు రూ. 10 వేల కోట్ల లబ్ధి ఓ రికార్డు అని అన్నారు. మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్ స్వీకరించే ధైర్యం వైసిపిలో ఒక్కరికైనా ఉందా? అని ప్రశ్నించారు. నిన్నటి దాకా వైసిపి సైకోలు మహిళలను కించపరిచారని, ఇప్పుడు తల్లులు ఆనందంగా ఉండడం చూసి తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. రంగులు, బొమ్మల పిచ్చితో గత పాలకులు విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, టీచర్ల నియామకంపైనే కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## గొల్ల కురుమలకు మంత్రి పదవి ఇవ్వాలి

**హైదరాబాద్ జూన్ 14, ( వెలుతురు)**

గొల్ల కురుమలకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గొల్ల కురుమ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ దాదాపు తెలంగాణ రాష్ట్రంలో గొల్ల కురుమలు 28 లక్షల జనాభా ఉన్నారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం మేమెంతో మాకు అంత వాటా దక్కాలన్నారు. మంత్రి పదవితో పాటు రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించాలన్నారు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులకు నామినేటెడ్ పదవులు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. పార్టీ అంతర్గత పదవులలో కూడ గొల్ల కురుమలకు స్థానం కల్పించాలన్నారు..

## ప్రజా సమస్యలు వినకపోతే పల్లె బాట కార్యక్రమం ఎందుకు ?

- అత్తా కోడళ్లపై తిరగబడుతున్న పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు



**వరంగల్ జూన్ 14, ( వెలుతురు)**

పాలకుర్తి నియోజకవర్గంలో ఏ ఊరికి వెళ్ళినా అత్త ఝాన్సీ రెడ్డి, కోడలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిలకు నిరసన సెగ తగులుతోంది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం మెత్యతండా గ్రామంలో పల్లె బాట కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్త ఝాన్సీ రెడ్డి పాల్గొన్నారు. తాగునీటి సమస్య ఉందని, విద్యుత్ అంతరాయం ఉందని, ప్రభుత్వ పథకాల మంజూరులో ఆమె అనుచరులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఝాన్సీ రెడ్డిని గ్రామస్తులు నిలదీసారు. దీంతో అక్కడే ఉంటే దాడి చేసే ప్రమాదం ఉందని భయపడి సైరన్ వేసుకొని ఝాన్సీ రెడ్డి వెళ్లిపోయారు. ప్రజా సమస్యలు విననప్పుడు, ప్రజల కష్టాలపై స్పందించినప్పుడు పల్లె బాట కార్యక్రమం ఎందుకు నిర్వహించారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

## యాభై వేలు ఇస్తేనే ఇందిరమ్మ ఇల్లు

**తాండూరు జూన్ 14, ( వెలుతురు)**

తాండూరు మండలం చంద్రవంచ గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మి, భర్త మ్యాతరి రాములు, మాట్లాడుతూ. ఇందిరమ్మ ఇండ్ల కోసం 50 వేల వరకు డబ్బులు ఇస్తేనే ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని గ్రామ మాజీ సర్పంచ్ భర్త అడిగినట్టు తెలిపారు. తమ ఇల్లు కూలిపోయి 18 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు గ్రామ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లంచాలు ఇచ్చే స్తోమత తమకు లేదని తెలిపిన కూడా తమకు ఇల్లు రానట్టు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మాజీ సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని చంద్రమంచ గ్రామానికి చెందిన మ్యాటర్ లక్ష్మి కోరింది. తమకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను వేడుకుంటుంది

## రాజీతో కేసుల పరిష్కారం

**చేవెళ్ల జూన్ 14, ( వెలుతురు)**

లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా కేసుల పరిష్కారానికి సులువైన మార్గం లభిస్తుందని చేవెళ్ళ జూనియర్ సివిల్ – జడ్జ్ దశరథ రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా శనివారం చేవెళ్ల కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. పెండింగ్లో ఉన్న పలు కేసులు ఇరువురి రాజీతో పరిష్కరించబడ్డాయి. చేవెళ్ళ జూనియర్ సివిల్ జడ్జ్ దశరథ రామయ్య, జడ్జ్ శ్యామ్ కుమార్, రిటైర్డ్ జడ్జ్ లక్ష్మణ్ మాట్లాడుతూ... లోక్ అదాలత్తో విలువైన కోర్టు సమయం వృథా కాకుండా ఇరు వర్గాల వారు రాజీ పడడంతో సులువుగా కేసుల పరిష్కారం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్షణికావేశంలో చేసిన తప్పులను తిరిగి పునరావృతం కాకుండా చూడాలని, కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో సివిల్ జడ్జ్ శ్యామ్ కుమార్, రిటైర్డ్ జడ్జి లక్ష్మణ్, చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు చేవెళ్ళ సీఐ భూపాల్ శ్రీధర్ రెడ్డి ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ చంద్రనాయక్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

**హైదరాబాద్ జూన్ 14, ( వెలుతురు)**

పేద ప్రజలకు వ్యాధులు సంభవించినప్పుడు ఎక్కడ వెళ్ళలేని పరిస్థితి ఉన్న వారికి మెడికల్ క్యాంపు ఎంతో దోహదపడుతుంది ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దజనహిత సేవా ట్రస్ట్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్, కిమ్స్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ విచ్చేసి మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఇక్కడ అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాలను పరీక్షించుకొని డాక్టర్లను సంప్రదించి మంచి వైద్యం తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో జరిగే ఇలాంటి హెల్త్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గద్దర్ అవార్డ్స్ లో గద్దర్ మిస్సింగ్

**హైదరాబాద్, జూన్ 14, ( వెలుతురు)**

ఏం చేసినా వివాదమే.. ఏదో ఒక లోపమే.. సోషల్ మీడియాలో రభస అవుతున్నది. ప్రధాన మీడియా దెప్పి పొడుస్తోంది. అయినప్పటికీ రేవంత్ ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోంది. చివరికి ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా ఉండడం లేదు.. ఇలా ఎందుకు జరుగుతోందో అర్థం కావడం లేదు. ప్రభుత్వ వైఫల్యమా? విపరీతమైన నిర్లక్ష్యమా? అనేది అంతు పట్టడం లేదు . అప్పుడెప్పుడో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నంది అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు ఆ పురస్కారాలను ఇచ్చింది లేదు. కెసిఆర్ ప్రభుత్వం మొత్తానికే ఆ అవార్డులను కోల్డ్ స్టోరేజ్ లో పడేసింది. దాదాపు దశాబ్ద కాలంగా తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం తరఫున అవార్డులు ఇచ్చింది లేదు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించి పురస్కారాలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణలో వాగ్గేయకారుడుగా.. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గద్దర్ స్మృత్యర్థం అవార్డును ప్రకటించారు రేవంత్ రెడ్డి. గద్దర్ పేరు మీద ఉత్తమ చిత్రాలకు, ఉత్తమ నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, ఇతర బృందాలకు పురస్కారాలను అందిస్తామని వెల్లడించారు. అంతేకాదు అవార్డుల కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సినీ నటి జయసుధ, ప్రఖ్యాత నిర్మాత దిల్ రాజులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఉత్తమ చిత్రాలు, ఉత్తమ నటీనటులు, ఇతర సాంకేతిక బృందాలకు అవార్డులను ప్రకటించింది ప్రభుత్వం. శనివారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ..




ప్రభుత్వం చేసిన తప్పు వివాదంగా మారింది. సోషల్ మీడియాలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. గద్దర్ అవార్డుల ప్రధానోత్సవానికి సంబంధించి ముద్రించిన ఆహ్వాన పత్రికలో రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దిల్ రాజు ఫోటోలను మాత్రమే ప్రచురించారు. గద్దర్ అవార్డుకు సంబంధించిన ప్రతిమను కూడా అందులో ప్రముఖంగా చూపించారు. అయితే టీజీఎఫ్ఏ పేరుమీద ఈ ఆహ్వాన పత్రికను ముద్రించారు. అయితే ఈ ఆహ్వాన పత్రికలో గద్దర్ ఫోటోను ముద్రించడం మర్చిపోయినట్టున్నారు. ఆహ్వాన పత్రిక ఒక్కసారిగా వెలుగులోకి రావడంతో వివాదం మొదలైంది. అసలే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి.. బజార్లో నిలబెట్టడానికి భారత రాష్ట్ర సమితి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ఈలోగా ఈ ఆహ్వాన పత్రిక విషయం వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో భారత రాష్ట్ర సమితి నెగిటివ్ ప్రచారానికి శ్రీకారం చుట్టింది.. ఇన్నేళ్లపాటు అవార్డులు ఎందుకు ఇవ్వలేదు? అనే విషయాన్ని పూర్తిగా మర్చిపోయి.. అధికారంలో ఉన్నప్పుడు గద్దర్ కు అపాయింట్మెంట్ ఇవ్వని విషయాన్ని పక్కనపెట్టి.. రేవంత్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇంత జరుగుతున్నప్పటికీ.. ఇంతలా నెగటివ్ ప్రచారం చోటు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం తరఫునుంచి ఇంతవరకు ఒక్కరు కూడా మాట్లాడలేదు. అఫ్ కోర్స్ ఇటీవల కాలంలో భారత రాష్ట్ర సమితి ఎన్ని రకాలుగా ఆరోపణలు చేసినా.. ఏ స్థాయిలో విమర్శలు చేసినా.. కాంగ్రెస్ పార్టీ నుంచి స్పందన ఉండటం లేదు. ఆ పార్టీలో అధికార ప్రతినిధులు ఉన్నామంటే ఉన్నారు. పదవుల కోసం పైరవీలు చేయడం తప్ప.. ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్ప.. వారు పార్టీ కోసం చేస్తున్నది ఏమీ లేదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇక ఎప్పటి లాగానే భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియాలో రెచ్చిపోతోంది. యధావిధిగా కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా ఉండిపోతుంది. పాపం చేసింది కూడా చెప్పుకోలేని దుస్థితి కాంగ్రెస్ పార్టీది. చేసే పనిలో ఫర్ఫెక్షన్ వదిలేసి వివాదాల పాలయ్యే దారుణం ఆ నాయకత్వానిది.. పాపం రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఎప్పుడు తన తప్పులు సరిదిద్దుకుంటుందో.. ఎప్పుడు వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా చూసుకుంటుందో..

# ఇంకా కీలక శాఖలకు సీఎం దగ్గరే...

**హైదరాబాద్, జూన్ 14, ( వెలుతురు)**

ప్రాంతీయ పార్టీలకు ఆయా రాష్ట్రాల రాజధానులలో కార్యాలయాలు ఉంటాయి. ప్రాంతీయ పార్టీలో వ్యక్తిస్వామ్యం నడుస్తుంది కాబట్టి.. ఆయన చెప్పినట్టుగానే పదవుల కేటాయింపు జరిగిపోతుంది. ఇది మనదేశంలో అత్యంత సర్వసాధారణమైన విషయం. అదే జాతీయ పార్టీ అయితే ఢిల్లీలో కార్యాలయాలు ఉంటాయి.. చాలామంది పెత్తనాలు సాగుతూ ఉంటాయి కాబట్టి.. ప్రతి విషయంలోనూ మంతనాలు జరుగుతూ ఉంటాయి.జాతీయ పార్టీలో నాయకులు ఒక్కో తీరుగా ఉంటారు. అందరిని సమన్వయం చేసుకొని.. అందరిని మచ్చిక చేసుకొన్న తర్వాతే పదవులు లభిస్తాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఈ సంస్కృతి ఎప్పటి నుంచో ఉంది. అందువల్లే ఆ పార్టీలో ఏదైనా సాధ్యమే అనే నానుడి కూడా పుట్టింది. ముఖ్యమంత్రిలను కీలుబొమ్మలు లాగా మార్చి.. వారితో ఆటలాడించే పార్టీగా కాంగ్రెస్ కు జాతీయ రాజకీయాలలో మంచి పేరే ఉంది. అక్కడ దాకా ఎందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సందర్భాలలో ముఖ్యమంత్రులను మార్చి కాంగ్రెస్ పార్టీ తన పేరును మరొకసారి సార్థకం చేసుకుంది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత రోశయ్యను ముఖ్యమంత్రిని చేసింది. ఆ తర్వాత కొద్ది రోజులకు రోశయ్యను పక్కనపెట్టి కిరణ్ కుమార్ రెడ్డికి ముఖ్యమంత్రి



పదవి కట్టబెట్టింది. బహుశా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రిగా సేవలు అందించిన రికార్డు కిరణ్ కుమార్ రెడ్డి సొంతం చేసుకున్నారు.. సరిగ్గా 11 సంవత్సరాల క్రితం తెలుగు రాష్ట్రం విడిపోయింది.. రెండు ముక్కలైంది. ఇందులో తెలంగాణ రాష్ట్రంలో రెండు పర్యాయాలు భారత రాష్ట్ర సమితి అధికారాన్ని అనుభవించింది. ఇక ఆంధ్రప్రదేశ్లో ఒకసారి టిడిపి.. మరొకసారి వైసిపి అధికారంలోకి వచ్చాయి. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం అధికారాన్ని దక్కించుకుందితెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాది పరిపాలన విజయవంతంగా పూర్తి చేసుకుంది. రెండవ ఏడాదిలోకి అడుగు పెట్టింది. ఇటీవల మంత్రివర్గ విస్తరణ కూడా చేపట్టింది. అందులో ముగ్గురికి మంత్రి పదవులు లభించాయి. వారంతా కూడా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే. ఈ క్రమంలో వారికి కేటాయించిన శాఖల విషయంలో అనేక మతలబు జరిగింది. కనుక సందర్భంలో ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ శాఖను తనకు కావాలని కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి కోరినట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై ఢిల్లీలో భారీ స్థాయిలో మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి హస్తిన వెళ్లిన తర్వాత ఒక్కసారిగా సీన్ మారిపోయిందని.. తన వద్ద ఉన్న కార్మిక శాఖ, ఎస్సీ , ఎస్టీ, దివ్యాంగులు, పశుసంవర్ధక శాఖలను మాత్రమే ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నట్టు తెలుస్తోంది. తన వద్ద ఉన్న విద్య, హోం, మున్సిపల్ శాఖలను ఇవ్వడానికి ఒప్పుకోనట్లు తెలుస్తోంది. వాస్తవానికి తన వద్ద ఉన్న శాఖలను కొత్త మంత్రులకు ఇస్తానని హస్తినలో విలేకరులతో జరిగిన చిట్ చాట్ లో రేవంత్ రెడ్డి వెల్లడించారు. దీంతో తమకు కీలక శాఖలు దక్కుతాయని.. కొత్తగా ఏర్పడిన మంత్రులు భావించారు. కానీ అది అంత సులభం కాదని రేవంత్ రెడ్డి నిరూపించారు. కాకపోతే అధిష్టానం అనుమతి తీసుకుని తనకు అనుకూలంగా వ్యవహారాల సాగేలా రేవంత్ పావులు కదిపారు. దీంతో కొత్తగా ఏర్పడిన మంత్రులకు నామమాత్రంగా శాఖలు దక్కాయి. మంత్రి పదవవైతే దక్కింది చాలు.. శాఖల సంగతి తర్వాత అన్నట్టుగా.. ఆ మంత్రుల శైలి ఉన్నట్టు తెలుస్తోంది.

## ఏపీలో టాలీవుడ్ కు మంచి రోజులేనా

### ఇవాళ సీఎంతో పెద్దల భేటీ

**విజయవాడ, జూన్ 14, ( వెలుతురు)**

ఆంధ్ర ప్రదేశ్ లో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఎట్టకేలకు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఏపీ సీఎం చంద్రబాబును కలవనున్నారు. వాస్తవానికి అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే ముఖ్యమంత్రిని సినీ ప్రముఖులు కలవడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఏపీలో మాత్రం ఆ పరిస్థితి కనిపించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భం లేదు. అయితే సినీ పరిశ్రమకు చెందిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మాత్రం సినీ పెద్దలు కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. పనిలో పనిగా తెలుగు చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించే ప్రయత్నం చేశారు. అయితే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకుందామని సినీ పరిశ్రమ పెద్దలతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. త్వరలో మీరంతా సీఎం చంద్రబాబును కలవాలని సూచించారు. అయితే ఇటీవల హరిహర వీరమల్లు సినిమా విడుదల ప్రకటన వచ్చింది. అంతకంటే ముందే సినిమా థియేటర్ల బంద్ ప్రతిపాదన వచ్చింది. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యాలయం నుంచి ప్రత్యేక ప్రకటన వచ్చింది. చిత్ర పరిశ్రమ కోసం తాను కృషి చేస్తుంటే తనకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తారా? అంటూ పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు తర్వాత జరిగిన పరిణామాలతో ఈ నెల 15న సినీ పరిశ్రమ పెద్దలు ఏపీ సీఎం చంద్రబాబును కలిసేందుకు అపాయింట్మెంట్ తీసుకున్నారు.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చిత్ర పరిశ్రమ విస్తరించే ప్రయత్నం జరగడం లేదు. కేవలం హైదరాబాద్ కు సినిమా షూటింగులు పరిమితం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ కేవలం సినిమా మార్కెట్ కు పరిమితం అయింది. విశాఖలో షూటింగులు జరుగుతున్నా హైదరాబాద్ స్థాయిలో మాత్రం సాగడం లేదు. అవుట్ డోర్ షూటింగ్ లలో భాగంగా గోదావరి జిల్లాల్లో సైతం మునుపటి మాదిరిగా జరగడం లేదు. విజయవాడ తో పాటు తిరుపతి పరిసర ప్రాంతాలు షూటింగులకు అనుకూలంగా ఉన్నా సినీ నిర్మాతలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అటు విశాఖ మన్య ప్రాంతం సినిమా షూటింగులకు అనుకూలం. అయితే ఏపీలో సినీ పరిశ్రమ విస్తరణకు ఇదే సరైన సమయం. ఎందుకంటే ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినీ పరిశ్రమ విస్తరణకు.. ఆ రంగ ప్రముఖులకు కీలక సూచనలు ఇస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోందిసినిమా మాధ్యమం పై ఆధారపడి వేలాది మంది బతుకుతున్నారు. అలాగే ఇదో ఎంటర్టైన్మెంట్రంగంగా ఉంది. ప్రజలకు వినోదం పంచుతోంది. అయితే సినిమాల మాటున దోపిడీ జరుగుతోందన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ప్రధానంగా సినిమా థియేటర్ల లో టికెట్ల ధరలు సామాన్యుడికి అందనంత దూరంలో ఉన్నాయి. అక్కడ లభించే కూల్ డ్రింక్స్, ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలంటే సామాన్యుడికి వీలుపడదు. సెలవు రోజున సగటు చిన్న కుటుంబం సినిమాకు వెళ్తే.. జేబులో వెయ్యి రూపాయలు ఉండాల్సిందే. అంతలా బాదుడు ఉంటోంది. ఒక సినిమా పది రోజులు ప్రదర్శిస్తేనే హిట్ టాక్ వచ్చే రోజులు ఇవి. అందుకే ఆ కొద్ది రోజుల్లోనే ప్రేక్షకుడి నుంచి బాదుడు తప్పడం లేదు. అందుకే థియేటర్లకు రాయితీలు ఇవ్వాలి. ఆపై సినిమా షూటింగులకు తగ్గట్టు ఏపీని విస్తరించాలి. స్థానిక కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వాలి. ఇవి చేస్తేనే ఏపీలో సినీ పరిశ్రమ విస్తరిస్తుంది. నలుగురికి ఉపాధి దొరుకుతుంది.రాష్ట్ర విభజనజరిగి 11 సంవత్సరాలు అవుతోంది. కానీ ఇంతవరకు తెలుగు సినీ పరిశ్రమ విస్తరణ జరగలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్ప కార్యరూపం దాల్చలేదు. సినీ పరిశ్రమ ద్వారా తెలంగాణకు ఆదాయం వస్తుంటే.. మార్కెట్ విస్తరణకు మాత్రం ఏపీ ఉపయోగపడుతోంది. చిన్న సినిమాల నుంచి పెద్ద సినిమాల వరకు ఎవరికీ వారే సినిమా టిక్కెట్ల ధర పెంపునకు ఏపీ ప్రభుత్వ అనుమతి తీసుకుంటున్నారు. కానీ ఏపీలో చిత్ర పరిశ్రమ విస్తరించాలన్న ప్రయత్నం జరగడం లేదు. ఏపీలో చిత్ర పరిశ్రమ విస్తరణకు అవసరమైన అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కానీ ఎక్కడో ప్రయత్న లోపం జరుగుతోంది. ఆపై సినీ పరిశ్రమ నుంచి కూడా మద్దతు కరువవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీ సీఎం చంద్రబాబుకు సినీ పరిశ్రమ పెద్దలు కలవనుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ కలయిక మర్యాదపూర్వకంగా కాకుండా.. ఏపీలో పరిశ్రమ విస్తరణ, సగటు ప్రేక్షకుడకు అదనపు బాదుడు లేకుండా వినోదం పంచడం వంటి చర్యలపై దృష్టి పెడితే ఎంతో మేలు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## సిద్దిపేట జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన కే. హైమావతి

**సిద్దిపేట జూన్ 14, ( వెలుతురు)**

జిల్లాలోని ప్రజలకు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తానని నూతనంగా జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన కే. హైమావతి తెలిపారు. శనివారం ఐడిఓసి లోని జిల్లా కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఉదయం కలెక్టరేట్ కు రాగా జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగర్వాల్, అబ్దుల్ హమీద్ లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఛాంబర్ లో వేద పండితుల ఆశీర్వచనం తీసుకొని జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలే తన ప్రాధాన్యత కార్యక్రమాలని వాటిని జిల్లా ప్రజలకు సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మినీ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ఆయా శాఖల జిల్లా అధికారులను పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని సూచించారు. తదనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలవగా బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి నూతన జిల్లా కలెక్టర్ హైమావతికి పులబోకే అందించారు.

## నాలాల్లో పేరుకుపోయిన
# చెత్త తొలగింపు

● వేగంగా పనులు పూర్తి చేయాలన్న హైడ్రా కమిషనర్



**హైదరాబాద్, జూన్14( వెలుతురు):**
నగరంలోని నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు వేగవంతం చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. నాలాల్లో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలని, నాలా ఆక్రమణలుంటే తొలగించాలన్నారు. శుక్రవారం చింతల్‌బస్తీ మీదుగా సాగే బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. చింతలబస్తీలో మూడ్రోజుల క్రితం తొలగించిన నాలా ఆక్రమణల కింద భారీగా పేరుకుపోయిన పూడికను తొలగించాలన్నారు. శంకర్ పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి వచ్చే నాలా మియాఖాన్ గడ్డ, జన్వాడ, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, ఓయూకాలనీ, షేక్ పేట, బీజేఆర్ నగర్, మహాత్మాగాంధీ నగర్, హఖీమ్సా విరాట్‌నగర్, బృందావన్ కాలనీ, టోలిచౌకి, మెహిదీపట్నం మిలటరీ ఏరియా, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వరదనీరును తీసుకువస్తుంది. చింతల్ బస్తీలో ఇటీవల హైడ్రా అధికారులు నాలాల కబ్జాలను తొలగించే సమయంలో ధ్వంసమైన వాటర్ బోర్డు మెయిన్ పైప్ లైన్ ను అధికారులు రిపేర్లు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ పనులను ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైడ్రా నాలా ఆక్రమణ తొలగింపు సందర్భంగా బంజారాహిల్స్ సంప్ ఔట్ లెట్ నుంచి మసాబ్ ట్యాంక్, ఏసీ గార్డ్స్ కు మంచినీటిని సరాఫరా చేసే 300 ఎంఎం డయా పైప్‌లైన్ దెబ్బతిన్నది. స్పందించిన అధికారులు రిపేర్లు పూర్తి చేసి సరఫరా పునరుద్ధరించారు. అంతకు ముందు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉచిత ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు.

## ప్రజల మనసు చొరగొన్నవాళ్ళకే అవకాశం

● కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నేతలు

**హైదరాబాద్ జూన్14( వెలుతురు):**
ప్రజల మనసు చొరగొన్నవాళ్ళకే రాబోవు బల్దియా ఎన్నికలలో అవకాశం కల్పిస్తామని ఖైరతాబాద్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నేతలు పేర్కొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 11 లో ని లేక్ వ్యూ బంజారా లో ఖైరతాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, కార్పొరేటర్లు విజయ రెడ్డి, సంగీత హాజరై మాట్లాడారు. త్వరలో రానున్న బల్దిగా ఎన్నికలకు ప్రతి కార్యకర్త సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బల్దియా ఎన్నికలలో వందకు పైగా సీట్లను గెలుచుకొని జిహెచ్ఎంసి లో కాంగ్రెస్ సత్తా చాటుదామని అన్నారు. సిఫార్సులేఖలు, ఇతర పద్ధతులలో కార్పొరేటర్ సీట్లు కేటాయించడం అని కేవలం స్థానిక ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే కార్యకర్తలకు అవకాశం ఇస్తామని అన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో ఎలాంటి విభేదాలు లేవని చిన్న చిన్న సమస్యలు ఉంటే సరి చేసుకుంటూ ముందుకు సాగుతామని రోహిన్ రెడ్డి అన్నారు. దానంకు మంత్రి పదవిపై ప్రశ్నించగా తప్పనిసరిగా మంత్రి విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్టానం చూసుకుంటుందని అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని ప్రతి డివిజన్లో కాంగ్రెస్ జెండా ఎగరవేసేందుకు కృషి చేయాలని అన్నారు.

## ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రచ్చ రచ్చ

**ఖైరతాబాద్ జూన్14( వెలుతురు):**
ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయరెడ్డి,దానం నాగేందర్ వర్గీయుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని బంజారా హిల్స్ లోని లేక్ వ్యూ బంజారా ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి,మేయర్ గద్వాల విజయలక్ష్మి,కార్పొరేటర్లు సంగీత తదితరులు హాజరయ్యారు.10 గంటలకు ప్రారంభమైన సమావేశానికి గంటన్నర ఆలస్యంగా వచ్చిన ఖైరతాబాద్ కార్పొరేటర్ తన వర్గీయుల తో మాట్లాడిస్తుండగా ఎమ్మెల్యే దానం నాగేందర్ అడ్డు తగిలి అవకాశం ఇచ్చామని ఎక్కువ చేస్తున్నారా మైక్ ఇచ్చేయాలంటూ ఆదేశించారు.మైక్ మీకు ఇవ్వవలసిన అవసరం లేదు తమ వాళ్ళు మాట్లాడతారంటూ విజయ రెడ్డికి సమాధానం చెప్పారు. దీంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. దానం విజయా రెడ్డి వర్గీయులు ఒకరిని ఒకరు నెట్టుకున్నారు.దీంతో రోహిన్ రెడ్డి కలగజేసుకొని ఇరు వర్గీయులను శాంతింప చేశారు.

## క్రైస్తవుల భారీ ర్యాలీ

**సికింద్రాబాద్ జూన్14( వెలుతురు):**
హైదరాబాద్ ట్రంపెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ ఆద్వర్యంలో క్రీస్తు రెండవ రాకపై ప్రజలలో అవగాహణ కల్పించడం కోసం సికింద్రాబాద్ లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండిపెండెంట్ చర్చిస్ యూనియన్ చీఫ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ విల్సన్ సింహం హాజరై రిబ్బన్ కట్ చేయగా, గౌరవ అతిధులుగా తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, సీఎస్ఐ మెదక్ డయోసీస్ వైస్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ బీ విన్సెంట్ జెండా ఊపి ర్యాలీని ప్రారంబించారు. ఈ సందర్భంగా ట్రంపెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ అద్యక్షుడు సెల్విన్ రాజ్ మాట్లాడుతూ యేసు రెండవ రాకను గురించి ముఖ్యంగా క్రైస్తవులు తెలుసుకోవలసిన అవసరమెతైనా ఉందని తెలిపారు. ప్రతి సంవత్సరం జూన్ రెండవ శనివారం ఈ ర్యాలీని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ర్యాలీ వెస్లీ కళాశాల నుండి ప్రకాష్ నగర్ పెండర్ గాస్ట్ రోడ్డు చివరి వరకు వెళ్లి తిరిగి రావడం జరిగిందని, ర్యాలీలో బిషప్ తోపాటు పలువురు క్రైస్తవ ప్రముఖులు, పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొన్నారని వెల్లడించారు.

## జాతీయ రహదారిపై బోల్తాపడ్డ మామిడిపండ్ల లారీ

**షాద్ నగర్ జూన్14( వెలుతురు):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం తిమ్మాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై ఉదయం మామిడిపండ్ల లారీ బోల్తా పడింది. కర్ణాటక నుండి ఢిల్లీ వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో అందులోని మామిడిపండ్లు రహదారిపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్కు గాయాలయ్యాయి. లారీ బోల్తాపడిందని తెలియగానే, ప్రజలు రోడ్డుపై పడిన మామిడిపండ్లను ఏరుకోవడం ప్రారంభించారు. చేతికి దొరికినన్ని పండ్లను సంచుల్లో, బుట్టల్లో నింపుకుని తీసుకెళ్లారు. కనీసం తిమ్మాపూర్ నుండి కొత్తూరు వరకు ట్రాఫిక్ జాం ఏర్పడింది.

# ట్రెండింగ్ లో కేసీఆర్ జగన్ కంబ్యాక్ ...





**హైదరాబాద్, జూన్14( వెలుతురు):**
అధికారం కోసం రాజకీయ పార్టీలు ఏమైనా చేస్తాయి. ఎలాంటి పనులకైనా పాల్పడుతుంటాయి. ఎందుకంటే అధికారం అనేది మత్తు లాంటిది. అధికారమనేది మంత్రదండం లాంటిది. దానివల్ల వెనకేసుకోవచ్చు.. దాచుకోవచ్చు.. గిట్టని వాళ్లను పాదాల కింద తొక్కవచ్చు. అందువల్లే రాజకీయ నాయకులు అధికారం కోసం అర్రులు చాస్తూ ఉంటారు.వెనకటి కాలంలో అధికారం కోసం రాజకీయ నాయకులు విస్తృతంగా ప్రచారాలు నిర్వహించేవారు. కార్యకర్తలతో మంతనాలు జరిపేవారు. పై స్థాయి నాయకులతో భేటీలు నిర్వహించేవారు. కానీ ఇప్పుడు రాజకీయాల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది కదా. రాజకీయాలు చేసే తీరు పూర్తిగా వేరే తీరు సంతరించుకుంది కదా. అందువల్లే రాజకీయ నాయకులు తమ సిద్ధాంతాలను మార్చేసుకున్నారు. తమ వ్యూహాలకు వేరే విధంగా పదును పెట్టుకున్నారు. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత రాజకీయ నాయకులు మరింతగా మారిపోయారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రజలతో సంబంధాలు నెరిపే కంటే.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ జాబితాలో ఈ నాయకుడు ఆ నాయకుడు అని తేడా లేదు.. అందరూ అలానే ఉన్నారు.అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు గుర్తుకురారు. కేవలం వారి సొంత ప్రయోజనాలు మాత్రమే నాయకులకు గుర్తుకు వస్తుంటాయి. అధికారం దూరమైతే వారికి ప్రజలు గుర్తుకు వస్తుంటారు. ముందుగానే చెప్పినట్టు ఈ కాలంలో సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగిపోయింది.. సోషల్ మీడియా లేకుంటే రాజకీయ నాయకులకు నిమిషం కూడా గడవలేని పరిస్థితి నెలకొంది. అందువల్లే వారు సోషల్ మీడియాలో తమ కిరాయి సైన్యంతో రకరకాల ప్రచారాలు చేయిస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీకి ఏదో జరిగిపోతుందని.. ప్రజలు మొత్తం తీవ్రమైన దుఃఖంలో ఉన్నారని.. విపరీతమైన కష్టంలో ఉన్నారని.. ఈ సమయంలో తమ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఆ రాజకీయ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో పెడ బొబ్బలు పెడుతున్నారు. అంతేకాదు తమ సోషల్ మీడియా సైన్యంతో రకరకాల వీడియోలు రూపొందించి పోస్ట్ చేస్తున్నారు.. వాస్తవానికి ప్రజలు తిరస్కరిస్తేనే కదా అధికారాన్ని కోల్పోయింది.. ప్రతిపక్ష స్థానానికి పరిమితమైంది.. మరి ఆ మాత్రం సోయి ఆ రాజకీయ పార్టీల నాయకులకు ఎందుకు లేకుండా పోయింది.. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను ఏ విధంగా ఇబ్బంది పెట్టారు.. ఏ విధంగా హింసించారు అనేది ఆ నాయకులకు గుర్తుకు రాదా.. పోనీ గుర్తుకు ఉండదా.. ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక వీడియోను కొంతమంది తెగ సర్కులేట్ చేస్తున్నారు. ఆ వీడియోలో రెండు తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు కెసిఆర్, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. గతంలో వీరిద్దరూ ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పుడు.. భాయీ భాయీ అన్నట్టుగా తిరిగేవారు. అంతేకాదు ఒకరికి ఒకరు సహాయం కూడా చేసుకున్నారు. ఈ క్రమంలో వారిద్దరూ మళ్లీ అధికారంలోకి రావాలని.. వారిద్దరి కోసం రెండు తెలుగు రాష్ట్రాలు ఎదురుచూస్తున్నాయని కొంతమంది గతంలో ఉన్న దృశ్యాలను వీడియోలుగా రూపొందించి సోషల్ మీడియాలో సర్కులేట్ చేస్తున్నారు. అంతేకాదు వీరిద్దరూ తెలుగు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా రావాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.. వాస్తవానికి ఈ మాటలు అంటున్నది ప్రజలు కాదు.. సామాన్యులు అంతకన్నా కాదు. కేవలం ఈ పార్టీల పెయిడ్ సోషల్ మీడియా గ్రూపులు..ముందుగానే చెప్పినట్టు ప్రజలతో సంబంధాలను పెంచుకోవడానికి నేటి కాలంలో రాజకీయ నాయకులు ఇష్టం చూపించడం లేదు. ఆసక్తిని ప్రదర్శించడం లేదు. కోటలాటి గృహాలలో ఉండుకుంటూ.. ఇనుప కాంచన నిర్మించుకుంటూ అందులో నివసిస్తున్నారు. అలాంటి వారికి అధికారాన్ని తిరిగి తెప్పించడానికి కొంతమంది సోషల్ మీడియాలో గంగ వెర్రులు ఎత్తుతున్నారు. లేనిపోని ప్రచారం చేసి ఏదో జరిగిపోతుంది అనే భ్రమ కల్పిస్తున్నారు.

# కరెంట్ కు తల్లికి వందనానికి లింక్...




**విజయవాడ, జూన్14( వెలుతురు):**
రాష్ట్రవ్యాప్తంగా తల్లికి వందనం నిధులు జమ చేసినట్లు చెబుతోంది కూటమి ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మందికి పైగా అర్హులు ఉన్నట్లు తేల్చింది. కానీ రకరకాల కారణాలు చెబుతూ ఈ జాబితాలో చాలా వరకు కోత పడింది. ముఖ్యంగా 300 యూనిట్ల విద్యుత్ వినియోగం అంటూ అనర్హుల జాబితాలో చేర్చడం ఆందోళన కలిగిస్తోంది. అసలు విద్యుత్ బిల్లుల విషయంలో అస్పష్టత కొనసాగుతోంది. ట్రూ ఆఫ్ చార్జీలు పెరిగాయని ఒకసారి.. తగ్గాయని మరోసారి.. ఇలా విద్యుత్ చార్జీల్లో వ్యత్యాసం కనిపించింది. అయితే ఇది సర్వసాధారణ చర్యగా భావించిన సామాన్యులకు ఇప్పుడు తల్లికి వందనం రూపంలో షాక్ తగిలింది. మీరు నిర్దేశించిన యూనిట్ల కంటే అధికంగా విద్యుత్ వినియోగించారంటూ తల్లికి వందనం పథకంలో కోత విధించారు. దీనికి తోడు సాంకేతిక సమస్యలు, ఆధార్ సీడింగ్ అంటూ కొత్త మెలికలు పెట్టి భారీగా కోత విధిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటూ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారువిద్యుత్ వినియోగం300 యూనిట్ల కంటే అధికంగా ఉంటే జగన్ సర్కార్ అమ్మ ఒడి పథకాన్ని నిలిపివేసింది. అప్పట్లో దీనిని తప్పు పట్టింది కూటమి. కరెంటు ఎక్కువ కాలిస్తే పథకం నిలిపివేస్తారా అని నిలదీసింది. ఇప్పుడు అదే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చింది. కరెంటు ఎక్కువగా వినియోగిస్తే పథకం ఇవ్వలేమంటూ తేల్చేసింది. అయితే సామాన్యుడికి విద్యుత్ చార్జీల విషయంలో అవగాహన లేదు. అందుకే విద్యుత్ వినియోగం విషయంలో ఏం చేయాలో పాలు పోక.. వచ్చిన బిల్లును కట్టుకుంటూ ముందుకు సాగాడు. కానీ తీరా ఇప్పుడు పథకం అమలు విషయానికి వచ్చేసరికి షాక్ తగిలేలా కూటమి సర్కార్ విద్యార్థుల తల్లిదండ్రులకు చేదు వార్త వినిపించింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా తల్లుల ఖాతాలో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేష్ తల్లికి వందనం నిధులు జమ చేశారు. కానీ సాయంత్రానికే ప్రతి గ్రామంలో పదిమందికి తగ్గకుండా విద్యుత్ వినియోగం అధికం చేశారన్న నెపంతో పథకాన్ని నిలిపివేశారు. దీంతో కొందరు తల్లులకే వందనమా అంటూ సెటైర్లు పడుతున్నాయి. ఒక ఏడాది సాయాన్ని ఇప్పటికే హరించారు. ఇప్పుడు వస్తుందనుకున్న తల్లికి వందనం పథకం రాకపోయేసరికి సగటు లబ్ధిదారుడు కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహంగా ఉన్నాడు. కనీసం ముందస్తుగా మార్గదర్శకాలు, వినతులు స్వీకరించి ఉంటే ఇటువంటి సాంకేతిక సమస్యలు అధిగమించే అవకాశం ఉంది. కానీ ఉన్నపలంగా మార్గదర్శకాలు జారీ చేయకుండా.. కొందరి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేసి.. 300 యూనిట్ల విద్యుత్ వినియోగం పేరిట కొత్త విధించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.మరికొందరు 300 యూనిట్ల విద్యుత్ వినియోగించకుండానే పథకానికి అనర్హుల పేరిట తేల్చేయడంపై కూడా విమర్శలు వస్తున్నాయి. ఇదేమని సచివాలయాలకు వెళ్తుంటే.. విద్యుత్ కార్యాలయాలకు పంపిస్తున్నారు. విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళితే అంతా సరిగ్గా ఉంది సచివాలయాలకు వెళ్ళండి అంటూ సూచిస్తున్నారు. దీంతో సామాన్యుడికి అర్థం కావడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో లేని నిబంధనలు.. ఇప్పుడు తెరపైకి రావడం పై ఎక్కువ మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు ఎక్కువ కాల్చితే.. పథకాలు నిలిపివేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు విద్యుత్ చార్జీలు పెరిగాయి. కుటుంబ అవసరాల కోసం విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో కొంతమంది అధికంగా విద్యుత్ వినియోగించారు. సాధారణంగా వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువ. దీంతో ఏడాది ప్రాతిపదికగా తీసుకొని విద్యుత్ వినియోగాన్ని లెక్కించలేదు. 250- 300 యూనిట్ల మధ్య విద్యుత్ వినియోగించిన వారిని సైతం అనర్హులుగా తేల్చడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనికి తోడు సాంకేతిక సమస్యలు ఉండనే ఉన్నాయి. తల్లికి వందనం అనేది విద్యా శాఖ తో పాటు సచివాలయాలు, ఆపై విద్యుత్ శాఖ, రవాణా శాఖ వంటి అంశాలతో ముడిపడి ఉంది. కానీ ఇవేవీ పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం ఉన్నఫలంగా తల్లికి వందనం పేరిట లబ్ధిదారుల ఖాతాలో నిధులు జమ చేసింది. వాస్తవానికి 69 లక్షల మంది లబ్ధిదారులు ఉంటే.. 45 లక్షల మందికి ఇవ్వడం ఏమిటనేది ఇప్పుడు ప్రశ్న. ఏడాదిగా పథకం అమలు చేయలేదు. తీరా ఇప్పుడు ఇచ్చారంటే నిబంధనల పేరిట కొర్రీలు పెడుతుండడం మాత్రం నిజంగా ప్రజలకు ఇబ్బందులకు గురి చేయడమే. మరి వాటిని సరిచేసి లబ్ధిదారులకు అందిస్తారో.. లేకుంటే ప్రజాగ్రహానికి గురి అవుతారో తేల్చుకోవాల్సింది ప్రభుత్వమే.

## ఏపీలో నాలా చట్టం రద్దు..

**విజయవాడ, జూన్14( వెలుతురు):**
ఏపీ రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులు రానున్నాయి. నాలా చట్టం రద్దుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దీనిపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ.. లోతుగా అన్ని విషయాలను పరిశీలిస్తోంది. తుది ముసాయిదా ప్రతిపాదనల రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీ ఆదేశాలు ఇచ్చిందివ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేసుకునేందుకు ఉద్దేశించిన ఏపీ అగ్రికల్చర్ ల్యాండ్(కన్వర్షన్ ఆఫ్ నాన్ అగ్రికల్చరల్ పర్పసెస్) యాక్ట్ 2006ను రద్దు చేసేందుకు విధివిధానాలు రూపొందించనున్నారు. ఈ మేరకు మంత్రివర్గం ఉపసంఘం ఆదేశాలను జారీచేసింది.వ్యవసాయేతర అవసరాలకు భూములను మార్పిడి చేసుకునేందుకు నాలా చట్టం వల్ల ఇప్పటి వరకు అనేక రకాల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలోనే దీన్ని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు. మూడో కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ప్రకటించారు. ఇదే విషయంతో పాటు రెవెన్యూ శాఖలో తీసుకురావాల్సిన అంశాలపై కేబినెట్ సబ్ కమిటీ కూడా ఏర్పాటైంది.ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో మూడోసారి భేటీ అయ్యింది. రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఈ భేటి జరిగింది. ఇందులో అనగాని సత్యప్రసాద్ తోపాటు మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు నాలాను రద్దు చేసి ప్రజలు ట్యాక్స్ కట్టేస్తే ఆటోమేటిక్ గా భూ మార్పిడి జరిగేలా ముసాయిదా విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రులు చెప్పారు. భూ మార్పిడి అత్యంత సులభంగా జరగాలని అభిప్రాయపడ్డారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఎలా చేయాలనే దానిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి సమావేశంలో అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలపై చర్చించనున్నారు. నిర్ణయించిన విధివిధానాలను మంత్రివర్గం ముందు పెడతామని మంత్రులు చెప్పారు.




పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ... ప్రజలకు ఇబ్బందిగా మారిన నాలాను రద్దు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అంతేకాక నాలా ట్యాక్స్ కూడా ఎక్కువగా ఉందని పలు సంఘాల నుండి అభ్యంతరాలు వచ్చాయన్నారు. ఆ ట్యాక్స్ ను కూడా ఎంతమేరకు తగ్గించవచ్చో ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వీలైతే ఈ ప్రతిపాదనలను జూన్ 19న జరిగే మంత్రివర్గ సమావేశంలో పెట్టి చర్చిస్తామని తెలిపారు.

https://epaper.velthuru.com

వెలుతురు

# cinema

## సిఎంతో సినీ పెద్దలతో భేటీ నేడే

### 22వ తేదీకి బదులు ఆదివారానికి మార్పు

### నేటి సాయంత్రంచంద్రబాబుతో ప్రముఖులు సమావేశం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో సినీ ఇండస్ట్రీ పెద్దల సమావేశం తేదీల్లో మార్పులు చేశారు. ఈ నెల 22వ తేదీకి బదులు ఆదివారం సీఎంతో భేటీ కావాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నాడు సాయంత్రం 4గంటలకి అమరావతిలో సీఎం చంద్రబాబుతో తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు భేటీ కానున్నారు. కాగా, ఈ సమావేశానికి పవన్ కళ్యాణ్ నేతృత్వం వహించబోతున్నారు. పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్ కోసం విదేశాలకు వెళ్లనున్నారు.. ఈ నేపథ్యంలో ఆదివారమే సినీ పెద్దల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ భేటీలో సినిమాల్లో తమకు ఎదురవుతున్న సమస్యలు, ఏపీలో షూటింగ్లకు పర్మిషన్, లొకేషన్ సమస్యలు, పన్నుల విధానం, సినీ పరిశ్రమ అభివృద్ధి తదితర అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం చంద్రబాబుతో సినీ పెద్దలు సమావేశం కావడం ఇదే మొదటిసారి. ఇప్పటి వరకు సినిమావాళ్లు సీఎంను కలవకపోవడంతో ఇటీవల పవన్ కళ్యాణ్ తీవ్రంగా మండిపడిన విషయం తెలిసిందే. అలాగే, ఏపీలో థియేటర్ల పరిస్థితి.. సదుపాయాలకు సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల సినిమాటోగ్రఫీ శాఖ ఆదేశాలు జారీ చేసింది. రంగంలోకి దిగిన అధికారులు.. థియేటర్లలో తనిఖీలు చేపట్టారు. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్ళు అయినా పూర్తిగా సినీ ఇండస్ట్రీ రాలేదు.. కనీసం సింగిల్ షెడ్యూల్ సినిమా కూడా ఏపీలో తీయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామాలతో ఈ సమావేశానికి మరింత ప్రాధాన్యత చోటు చేసుకుంది. కేవలం సినిమా టిక్కెటల్ ధరలు పెంచుకునే క్రమంలో మాత్రమే కలుస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం ఏం చెబుతుంది, సినీ ప్రముఖులు ఏం కోరతారనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతుంది.




## దర్శకుడిగా మారుతున్న కమెడియన్ రామకృష్ణ



టాలీవుడ్ కమెడియన్ రాహుల్ రామకృష్ణ దర్శకుడిగా మారనున్నారు. నటులు చాలామంది హీరోలుగా లేదా దర్శకులుగా మారుతున్నారు. ఇప్పటికే వేణు బలగం సినిమాతో దర్శకుడుగా మంచి పేరు సంపాదించారు. ఈ క్రమంలో రామకృష్ణ కూడా త్వరలోనే మెగాఫోన్ పట్టి ఒక చిత్రాన్ని తెరకెక్కించ నున్నారు. ఈ మేరకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టారు. తాను దర్శకత్వం వహించనున్న తొలి ప్రాజెక్ట్‌కు సంబంధించి నటీమణుల ఎంపిక ప్రారంభించారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా శనివారం ఉదయం ఆయన పోస్ట్ పెట్టారు. దర్శకుడిగా నా తొలి ప్రాజెక్ట్.. మీలో ఎవరికైనా ఆసక్తి ఉంటే దయచేసి మీ షోరీల్స్, ఫొటోలను నా మెయిల్‌కు పంపించగలరని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఆయనే నిర్మాతగానూ వ్యవహరించనున్నట్లు– తెలుస్తోంది. షార్ట్ ఫిల్మ్‌తో నటుడిగా మారిన రాహుల్ రామకృష్ణ..'జయమ్ము నిశ్చయమ్మురా'తో పరిశ్రమకి ఎంట్రీ ఇచ్చారు. ఈ చిత్రానికి డైలాగ్ రైటర్‌గానూ వర్క్ చేశారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి' ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ సినిమా తర్వాత ఆయన తెలుగులో 'భరత్ అనే నేను', 'చి.ల.సౌ.', 'గీత గోవిందం', 'కల్కి', 'బ్రోచేవారెవరురా', 'అల.. వైకుంఠపురములో..', 'జాతిరత్నాలు', 'ఓం భీమ్ బుష్' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు.

## లిప్‌లాక్‌లకు తాను దూరం

### ఓ సినిమాలో అలా నటించినా..ఎడిటింగ్‌లో కట్

### అలనాటి హీరోయిన్ మధుబాల అంతరంగం



'రోజా' మూవీతో సినీ ప్రియుల హృదయాలు గెలుచుకున్న నటి మధుబాల. ఆ తరవాత జెంటిల్‌మెన్, అల్లరి ప్రియుడు వంటి సూపర్ చిత్రాల్లో మధుబాల పేరు సంపాదించుకుంది. మధుబాల ప్రస్తుతం 'కన్నప్ప' కోసం వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం సహాయ నటి పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోన్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న పలు ఇబ్బందుల గురించి మాట్లాడారు. ముఖ్యంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు నటిగా తాను కొన్ని షరతులు పెట్టుకున్నానని తెలిపారు. ఒక సినిమా కోసం తాను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చిందన్నారు. తీరా చూస్తే ఆ సన్నివేశాన్ని తొలగించారని వెల్లడించారు. స్కిన్ షో లేదా ముద్దు సన్నివేశాల్లో నటించడం నాకు నచ్చేది కాదు. అందుకే కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన సమయంలోనే ఆయా సన్నివేశాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆ కారణంతోనే చాలా సినిమాలు వదులుకున్నా. అయితే, ఓ సినిమా కోసం నేను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చింది. సెట్‌లోకి అడుగుపెట్టిన తర్వాత కిస్ సీన్ చేయాలని టీమ్ చెప్పింది. నేను అందుకు అంగీకరించలేదు. కాకపోతే, ఆ సీన్ ముఖ్యమని టీమ్ చెప్పడంతో చేసేది లేకపోయింది. దాంతో లిప్ కిస్ సీన్‌లో యాక్ట్ చేశా. అది నన్నెంతో ఇబ్బంది పెట్టింది. తీరా చూస్తే ఎడిటింగ్ సమయంలో ఆ సన్నివేశం అవసరం లేదని టీమ్ భావించింది. దాంతో సీన్‌ను తొలగించేశారు. ఆ విషయంలో దర్శకుడితో నేను ఏమీ గొడవ పడలేదు. సినిమా కోసం ఎలాంటి సన్నివేశాల్లోనైనా యాక్ట్ చేయాల్సి ఉంటుందని కొంతమంది సీనియర్ నటీమణులను చూశాక నాకు అర్థమైందని మధుబాల చెప్పారు. సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్ చిత్రాల్లో నటించే అవకాశం తనకు వచ్చిందని.. ఆడిషన్స్‌లోనూ తాను పాల్గొన్నానని ఆమె తెలిపారు. అయితే, ఆయా సినిమాలు చివరకు వేరే వాళ్లను వరించాయన్నారు. 'బాజీగర్'లో నటించే అవకాశం మొదట తనకే వచ్చిందని మధు చెప్పారు. పాత్రకు సరైన ప్రాధాన్యం లేదనే ఉద్దేశంతో తాను ఆ ఆఫర్ వదులుకున్నానన్నారు. అదే రోల్‌లో శిల్పాశెట్టి యాక్ట్ చేశారని వివరించారు.

## కుబేర మూవీ టీజర్ విడుదలకు రంగం సిద్ధం

### హైదరాబాద్ వేదికగా నేడు గ్రాండ్ ఈవెంట్

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర టీజర్ విడుదలకు రంగం సిద్ధం అయ్యింది. హైదరాబాద్ వేదికగా ఆదవారం ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వచ్చే వారం రిలీజ్ కాబోతున్న కుబేర సినిమాపై ఆడియెన్స్‌లో ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడెప్పుడు సినిమా రిలీజవుతుందా అని ఉత్కంఠగా వేయిట్ చేస్తున్నారు.పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ , అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తుండగా. ఈ జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే.. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను వాయిదా వేసిన విషయం తెలిసిందే. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరగడంతో ఈ వేడుకను వాయిదా వేసుకున్నారు. తాజాగా ఈ వేడుకకి సంబంధించి కొత్త డేట్‌ని ప్రకటించారు. కుబేరా ప్రీ రిలీజ్ వేడుకను జూన్ 15న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించ బోతున్నట్లు తెలిపారు. అలాగే ఈ మూవీ నుంచి రేపు –ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు– చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి చిత్రబృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. ట్రైలర్ లాంచ్‌తో సినిమాపై మరింత హైప్ పెరిగేలా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.




## క్రేజీ హీరోయిన్ శ్రీలీల బర్త్‌డే

### రెండు సినిమాలకు సంబంధించి పోస్టర్ల విడుదల

ప్రస్తుతం సౌత్ లో క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతోంది శ్రీలీల. అనతి కాలంలోనే తన అందం, అభినయం, ఎనర్జీతో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ జూన్ 14 తన పుట్టినరోజును జరుపుకుంది. ఈ సందర్భంగా శ్రీలీలకు పలువురు విషెస్ చెప్పారు. ఆమె నటిస్తున్న రెండు భారీ ప్రాజెక్టుల నుంచి బ్యాక్ టూ బ్యాక్ స్పెషల్ పోస్టర్స్‌ను విడుదల చేశారు నిర్మాతలు. ఇందులో 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒకటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్‌లో ఆమె గ్లామర్‌తో పాటు డ్రస్సింగ్ ÷–టస్టైల్ కూడా ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఇక అలాగే.. మరోవైపు మాస్ రాజా రవితేజ 'మాస్ జాతార' మూవీ నుంచి కూడా బర్త్‌డే స్పెషల్ పోస్టర్ విడుదలైంది. ఇందులో శ్రీలీల మరోసారి ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. ఈ సినిమాలో ఆమె పాత్ర కు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు బయటకు రాలేనప్పటికీ, పోస్టర్ చూస్తేనే ఆమె పాత్ర పట్ల ఆసక్తి పెరిగింది. ఇక ఈ రెండు పోస్టర్లు బర్త్‌డే సందర్భంగా విడుదల కావడంతో శ్రీ లీల అభిమానులు సోషల్ మీడియాలో భారీగా పోస్టులు షేర్ చేస్తున్నారు. కాగా శ్రీలీల కెరీర్‌లో చిత్రాలు మరో మైలురాయిగా నిలవనున్నాయి.








## పాక్‌లో దంగల్‌ను అందుకే విడుదల చేయలేదు

### ఆనాటి వివరాలు వెల్లడించిన అమీర్ ఖాన్



బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులని ఎంతగా అలరిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అమీర్‌ఖాన్ దర్శకత్వం వహించడంతో పాటు– ప్రధాన పాత్రలో రూపొందిన తారే జమీన్ పర్ 2007లో విడుదలై సంచలన విజయం సాధించింది.. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందించిన సినిమా సితారే జమీన్ పర్ . 2018లో స్పానిష్ ఛాంపియన్స్ మూవీ ఆధారంగా హిందీలో రూపొందించిన ఈ సినిమాకు దివ్య నిధి శర్మ కథ అందించగా . ఆర్. ప్రసన్న దర్శకత్వం వహించాడు. ఈ మూవీని అమీర్ ఖాన్ స్వయంగా నిర్మించాడు. జెనీలియా దేశ్‌ముఖ్ కీలక పాత్ర పోషించింది. జూన్ 20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొద్ది రోజులుగా మూవీ ప్రమోషన్స్ తో బిజీగా ఉన్న అమీర్ ఖాన్ ఆసక్తికర విషయాలు పంచుకుంటు–న్నారు. ఆయన నటించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'దంగల్' పాకిస్తాన్‌లో ఎందుకు విడుదల కాలేదన్న అంశంపై తాజాగా వివరణ ఇచ్చారు. పాక్ లో దంగల్ సినిమా విడుదల కావాలంటే వారు రెండు షరతులు పెట్టారు. మన జాతీయ గీతం, జాతీయ జెండాను మూవీ నుంచి తొలగించాలని అక్కడి సెన్సార్ బోర్డు చెప్పడంతో నేను దానికి ఏ మాత్రం అంగీకరించలేదు. గీతా ఫోగట్ మ్యాచ్ గెలిచిన సన్నివేశంలో భారత జెండాతో పాటు జాతీయ గీతం ఉంటుంది. ఆ రెండింటిని తొలగిస్తినే ఈ చిత్రానికి అనుమతి ఉంటుందని పాక్ సెన్సార్ చెప్పింది. దీంతో వెంటనే నేను మా సినిమా పాకిస్తాన్ లో విడుదల కాదని చెప్పాను. పాకిస్తాన్ విడుదలను రద్దు చేయడం వల్ల కలెక్షన్స్ విషయంలో కాస్త ప్రతికూల ప్రభావం పడుతుందని నిర్మాతలు నాతో చెప్పారు. అయినప్పటికీ, భారతదేశానికి వ్యతిరేకంగా ఉన్న దేనికీ మద్దతు ఇవ్వకూడదని స్పష్టంగా ఆరోజే చెప్పాను అని అమీర్ ఖాన్ అన్నారు. సినిమా విడుదల వల్ల డబ్బు వస్తుంది, కానీ దేశ ప్రయోజనాల విషయంలో మేము రాజీ పడం. దేశానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయానికీ మేము ఒప్పుకోము. ఇది నా ఒక్క నిర్ణయమే కాదు, అందరం కూడా అదే అభిప్రాయంతో ఉన్నామని అమీర్ స్పష్టం చేశారు. 2016లో విడుదలైన 'దంగల్' చిత్రం భారత రెజ్లింగ్ చాంపియన్స్ అయిన ఫోగాట్ సిస్టర్స్ జీవితం ఆధారంగా రూపొందింది. ప్రపంచవ్యాప్తంగా ...2,000 కోట్లకు పైగా వసూలు చేసిన ఈ చిత్రం చైనాలో కూడా ఘన విజయం సాధించింది. కానీ పాకిస్తాన్‌లో మాత్రం రాజకీయ కారణాల వలన విడుదల కాలేదు.

## కాళేశ్వరం ముందు
# అంతా కాకమ్మ కబుర్లు


- అంచనాలు పెంచడంపై కమిషన్ నిజాలు రాబట్టాలి
- మాజీ ఎమ్మెల్సీ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్



**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**
కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు ఇటీవల హాజరైన వ్యక్తులు.. క్యాబినెట్ నిర్ణయం మేరకే అంతా జరిగిందని చెప్పారని భాజపా నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. తప్పించుకోవడానికే ఇలా కాకమ్మ కథలు చెప్పారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ బహిరంగ విచారణ వద్దని అనడంలోనే అసలు ఉద్దేశం తెలుస్తోందన్నారు. బండారం బయట పడుతుందని అలా అడిగారని చెప్పారు. అప్పటి సీఎం కేసీఆర్ తప్పులు జరుగుతున్నా సరిచేయలేదని దుయ్యబట్టారు. కాళేశ్వరం బ్యారేజీలు కుంగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్ట్ లోకేషన్‌ను రాజకీయ కారణాలతోనే మార్చారు. అంచనాలు పెంచడంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమాధానాలు రాబట్టాలన్నారు. గత ప్రభుత్వ అవినీతిని బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదు. షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు.

## విమాన ప్రమాదాలు
# జరక్కుండా అప్రమత్తం

- అంతర్గత ఆడిటింగ్‌లు..ప్రత్యేక తనిఖీలు
- ఎయిరిండియా బోర్డు నిర్ణయం



**న్యూఢిల్లీ,జూన్14( వెలుతురు):**
గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై యావత్ ప్రపంచం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎయిరిండియా బోర్డు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. తమ అన్ని విమానాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు- సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విమాన ప్రమాదంలో 274 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో అంతర్గత ఆడిట్ నిర్వహించాలని ఎయిరిండియా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విమానాల కండీషన్, వాటి నిర్వహణ పద్ధతులు, ఇలా వివిధ శాఖలపై సమీక్ష కూడా చేయించడంపై ఎయిరిండియా ఛైర్మన్, సీఈవో సిద్ధమయ్యారు. భద్రతా ఆడిట్ నిర్వహణకు ఎయిరిండియా బోర్డును ఆదేశించారని తెలుస్తోంది. అంతేకాకుండా ఈ ఘటనపై మరో విచారణ చేపట్టనుంది. ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడం, వారిని సమగ్ర శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించడంపై దృష్టి పెట్టింది. విమాన ప్రమాదంపై అన్ని దర్యాప్తు సంస్థలకు సహకరిస్తామని ఎయిరిండియా పేర్కొంది. కాగా.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 విమానం ఇటీ-వల కూలిపోయిన సంగతి తెలిసిందే. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైంది. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో 274 మంది మృతి చెందారు. అయితే.. ఈ ప్రమాదంపై స్వయంగా దర్యాప్తు చేపట్టేందుకు ఎయిరిండియా సిద్ధమైంది. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర తనిఖీలు చేపడుతోంది.

## చేవెళ్లలో ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు

- కూల్చేసిన రెవెన్యూ సిబ్బంది


**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**




గ్రేటర్ హైదరాబాద్ లో ఓ వైపు హైడ్రా,మరో వైపు రెవెన్యూ,జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేస్తున్నారు. కొన్ని చోట్ల పర్మిషన్ లేకుండా ఇష్టారాజ్యంగా భవనాలు,బిల్డింగ్ లు కడుతున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. షాబాద్ మండల పరిధిలో హైతాబాద్ గ్రామం రెవెన్యూలోని సర్వే నెంబర్ 8 లో 42 ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించారు షాబాద్ ఎమ్మార్వో, అధికారులు. ఇష్టానుసారంగా హైతాబాద్ లో ఉన్నటువంటి బడా నాయకులు డబ్బుల కోసం వేరే వ్యక్తులకు షాపులు వేసుకొని నెలసరి మామూలు ఇవ్వాలని డిమాండ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం అధికారులకు తెలియడంతో అధికారులు ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలను జేసీబీ సాయంతో తొలగించారు. ఇలాంటివి జరగకుండా అక్రమ నిర్మాణాలను అరికట్టాలని గ్రామస్తులు ప్రభుత్వ అధికారులను కోరారు. నాలాలు ఆక్రమించి, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హైడ్రా వీటిపైనే ఫోకస్ పెట్టింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది.

# కాళేశ్వరం ఓ పనికిరాని ప్రాజెక్ట్

- దానికోసం డబ్బులు వృధా చేయరాదు
- అన్నీ తానే అన్న కెసిఆర్ ఇప్పుడు కేబినేట్ అంటున్నారు
- విమర్శలు గుప్పించిన సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని



**హన్మకొండ,జూన్14( వెలుతురు):**
ప్రజాధనాన్ని ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, దాన్ని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. కూనంనేని మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరానికి అన్నీ తానే అన్న మాజీ సిఎం కెసిఆర్ ఇప్పుడు సంబంధం లేదంటున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నిర్మించాక ఒక్క ఎకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని, ఎల్లంపల్లి ద్వారానే పంటలకు నీళ్లు అందుతున్నాయని తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సూచించారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు ఇప్పుడు నోరు మూసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అన్నీ తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదని ఎందుకు అంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. మహారాష్ట్ర పర్మిషన్ ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్‌రావు అంటున్నారని చెప్పారు. గతంలో 140మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టాలని తాము డిమాండ్ చేశామని గుర్తుచేశారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని స్పష్టం చేశారు కూనంనేని సాంబశివరావు. కేంద్రప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల మృతదేహాలను చూసి కూడా కేంద్రం భయపడుతోందని, మృతదేహాన్ని అప్పగించకపోవడం దారుణమని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితఎపిసోడ్ ఇప్పుడు రాజకీయాల్లో ఒక కొత్త చర్చకు దారితీసింది. తాజాగాకూనంనేని సాంబశివరావు షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత ప్రకటనతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య ఉన్న రహస్య ఒప్పందం బయటపడిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ షర్మిల స్థితిగతులు ఎలా ఉన్నాయో.. తెలంగాణలో కవిత పరిస్థితి కూడా అలాగే ఉందని ఆయన విమర్శించారు. పేదలు లేని దేశంగా ఇండియాని చూపాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. నెలకు రూ.8 వేల ఆదాయం ఉంటే ధనికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. పేదలను మోదీ ప్రభుత్వం దగా చేస్తోందని ఫైర్ అయ్యారు. నెలకు రూ. 20వేల ఆదాయం ఉన్నా కూడా పేదవారిగానే పరిగణించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

## కూర్మ గ్రామంలో అగ్నిప్రమాదంపై అనుమానాలు

- ఆ కోణంలోనూ దర్యాప్తు చేపడతాం
- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం పవన్



**అమరావతి,జూన్14( వెలుతురు):**
శ్రీకాకుళం జిల్లా కూర్మ గ్రామంలో అగ్నిప్రమాద ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ప్రమాద ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఆధునిక హంగులు లేకుండా ఆధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్ట కరమన్నారు. అగ్నిప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైందని తెలిపారు. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్లల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారులు సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారని అన్నారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలని డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇటీవల కూర్మ గ్రామంలోని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే రాధాకృష్ణ మందిరంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో విలువైన గ్రంథాలు, పుస్తకాలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.50 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం రంగంలోకి దిగి పలు ఆధారాలను సేకరించాయి. గతంలోనూ దుండగులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని నిర్వాహకులు తెలిపారు.

# నూనె శ్రీధర్ కేసులో కూపీ లాగుతున్న ఏసిబి

## ఉన్నతాధికారి ఆదేశాలను బేఖాతర్ చేసినట్లు గుర్తింపు




**హైదరాబాద్,జూన్14( వెలుతురు):**
అక్రమాస్తుల కేసులో అరెస్ట్ అయిన కాళేశ్వరం ఎస్ఈసీ నూనె శ్రీధర్ వ్యవహారంలో సంచలన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నూనె శ్రీధర్ వ్యవహారంలో మరి కొంతమంది ఇరిగేషన్ అధికారుల పాత్ర ఉన్నట్టుగా ఏసీబీ దర్యాప్తులో బయటపడింది. 2024 జూన్ 27న నూనె శ్రీధర్‌ను ఇరిగేషన్ చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఆదేశించారు. అయితే ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలను కూడా నూనె శ్రీధర్ పక్కకు పెట్టినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫర్ అయినప్పటికీ కూడా ఏడాది పాటు చొప్పదండిలోనే ఈఈగా శ్రీధర్ పని చేస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది. ఈఎన్‌సీ అనిల్ ఆదేశాల మేరకే శ్రీధర్ అక్కడే పని చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూనె శ్రీధర్‌కు ఈఎన్‌సీ అనిల్‌కు ఉన్న సంబంధాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. ఇరిగేషన్ చీఫ్‌గా ఉండి ప్రిన్సిపాల్ సెక్రటరీ చేసిన ట్రాన్స్‌ఫర్‌ను కూడా ఆపినట్టు- అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో నూనె శ్రీధర్‌ను కస్టడీకి తీసుకుని విచారించాలని ఏసీబీ నిర్ణయించింది. అలాగే ఈఎన్‌సీ అనిల్ పాత్రపైనా ఏసీబీ విచారణ జరిపే అవకాశం ఉంది. అక్రమాస్తుల కేసులో నూనె శ్రీధర్‌ను ఏసీబీ అరెస్ట్ చేయగా.. ఆయన చంచల్ గూడ జైలులో ఉన్నారు. శ్రీధర్‌కు సంబంధించిన అంశాలపై ఏసీబీ అధికారులు చాలా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఎవరెవరితో సత్సంబంధాలు ఉన్నాయి, ఇరిగేషన్ శాఖ అధికారులతో నూనె శ్రీధర్‌కు ఉన్న సంబంధాలు ఏంటి.. ఇతనికి ఎవరైనా సహకారం అందించారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సమయంలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల శ్రీధర్‌కు సంబంధించి సుమారు 20 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో కీలకమైన పత్రాలు, ఆస్తుల చిట్టాను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఎంతో గ్రాండ్‌గా శ్రీధర్ తన కుమారుడి వివాహం జరిపించారు. హైదరాబాద్‌లో హల్దీ, సంగీత్ ఫంక్షన్లు నిర్వహించగా.. థాయిలాండ్‌లో వివాహం జరిపించారు. ఇందుకోసం శ్రీధర్ కోట్లు కుమ్మరించినట్లు తెలుస్తోంది. అయితే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌కు ఇంత భారీ మొత్తంలో ఆస్తులు, ఆదాయం ఎలా సమకూరింది అనే అంశాలపై ఏసీబీ దృష్టి సారించింది.

## ఆధార్ అప్‌డేట్ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ,జూన్14( వెలుతురు):**
ఆధార్ అప్‌డేట్ చేసుకునే వారికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఉడాయ్ మరోమారు వెసలుబాటు కల్పించింది. ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఇచ్చిన గడువును మరోసారి పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. సంబంధిత డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌లోడ్ చేసుకునేందుకు ఇచ్చిన గడువు జూన్ 14వ తేదీతో..ముగియనుండగా ఉడాయ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా శనివారం వెల్లడించింది. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని స్పష్టం చేసింది. మై ఆధార్ పోర్టల్ ద్వారా ఉచితంగా ఈ డాక్యుమెంట్లను అప్ లోడ్ చేసుకోవచ్చు. ఆధార్ డేటాబేస్‌లో ప్రస్తుతం.. కచ్చితమైన సమాచారాన్ని ఉంచేందుకు ఆధార్ హోల్డర్లకు ఉడాయ్ ఈ అవకాశం కల్పిస్తోంది. గుర్తింపు పొందిన ఆధారాలు, చిరునామాకు సంబంధించిన పత్రాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు అనుమతిస్తోంది. వివాహం కావడం.. ఉన్నత చదువులు, తదితర కారణాల వల్ల కొందరు వేర్వేరు ప్రదేశాలకు మారుతూంటారు. అలాంటి వారికి ఇది ఉపయుక్తంగా ఉండనుంది. మరోవైపు ఆధార్ తీసుకుని పదేళ్లు పూర్తయ్యి ఉంటుందో వారు కూడా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని గతంలో ఉడయ్ సూచించిన సంగతి తెలిసిందే.

# గంజాయి రవాణా చేస్తున్న దంపతులు

- వారితో పాటు మరో ఇద్దరి పట్టివేత

**రాజమండ్రి,జూన్14( వెలుతురు):**
అక్రమ గంజాయి నిల్వ ఉంచి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్న భార్యాభర్తలు, వీరికి సహకరిస్తున్న మరో ఇద్దరు వ్యక్తులను తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పోలీసులు పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి ఒక వ్యాన్, కారు, రెండు మోటారు సైకిళ్లను, రేకుల షెడ్ సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి కేసుకు సంబంధించిన వివరాలను రాజమండ్రి నార్త్ జోన్ డిఎస్పీ వై. శ్రీకాంత్ వెల్లడించారు. రాజానగరం మండలంలో కొండగుంటూరు కొండాలమ్మ గుడి సమీపంలో ప్రైవేట్ లే అవుట్ రేకుల షెడ్ లో వీరిని పోలీసులు పట్టు-కున్నారని తెలిపారు. ఒరిస్సా జిల్లా చిత్రకొండ రఘువీర్ రాయ్, ఇతని భార్య ప్రశాంతి రాయ్ గంజాయి అక్రమంగా నిల్వ ఉంచి రవాణా చేస్తున్న కేసులో అరెస్టు చేశారు పోలీసులు. కారులో భార్యాభర్తలు గంజాయి తీసుకుని వచ్చినట్లు- తెలిసి పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. వీరికి సహకరించిన ఒరిస్సా రాష్ట్రం మల్కాగిరి జిల్లా చిత్రకొండ మండలం దొరగుడ పంచాయతీ సురేష్ చంద్ర కులదీప్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పొల్లూరు గ్రామానికి చెందిన చందన్ మండల్ ను అరెస్టు చేశారు. కారులో నుంచి 11 ప్యాకెట్లు 23.101 కేజీల గంజాయి దించుతుండగా దాడులు చేసి పట్టు-కున్నారు. గంజాయి, రవాణాకు ఉపయోగిస్తున్న ఒక వ్యాన్, కారు, రెండు బైకులను సీజ్ చేశారు. ఈ అక్రమ సంపాదనతో కొంతమూరులో విశాలమైన ఇల్లు కొనుగోలు చేసుకుని నివాసం ఉంటున్నారు నిందితులు. కొండ గుంటూరులో రేకుల షెడ్ సీజ్ చేశారు. కొంతమూరు ఇల్లు సీజ్ చేయడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు పోలీసులు.

## తిరుమల అన్న ప్రసాదంలో
# మ్యాంగో జ్యూస్

- సిఎంతో మాట్లాడి ఖరారు చేయించే ఆలోచన
- మామిడి రైతులకు అండగా ఉండేలా చర్యలు
- రైతులతో భేటీ అయిన మంత్రి అచ్చన్నాయుడు



**తిరుపతి,జూన్14( వెలుతురు):**
తిరుమల అన్న ప్రసాదంలో ఇతర పుణ్యక్షేత్రాల్లో మధ్యాహ్నం ఒక గ్లాస్ మ్యాంగో జ్యూస్ ప్యాకెట్ అందించేందుకు ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మామిడి సాగుతో పాటు ఇతర లాభసాటి పంటలపై రైతులు దృష్టి సారించాలని కోరారు. గుజ్జు పరిశ్రమలు రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నాయని అన్నారు. పాకాల మండలం దామలచెరువులో మామిడి రైతులు, వ్యాపారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5లక్షల హెక్టార్లకు పైగా మామిడి సాగు అవుతుందన్నారు. ఇప్పటికి 22వేల టన్నులు మార్కెటింగ్ జరిగింది.. లక్ష టన్నులకు పైగా మార్కెటింగ్ జరగాల్సి ఉందన్నారు. తోతాపూరి కేజీకి రూ.12 రైతులకు చెల్లించాలి. చివరి మామిడి కాయ వరకు రు.4 సబ్సిడీ కల్పిస్తాం. పరిశ్రమలు రూ.8 తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గుజ్జు పరిశ్రమలు సకరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మిర్చికి రూ.20వేలు వచ్చేదని జగన్ మోహన్ రెడ్డి అంటున్నాడు.. జగన్ మోహన్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడు.. గత 10 సంవత్సరాలలో ఒక్కసారి 2022లో మాత్రమే రూ.20 వేలు వచ్చింది.. మిగిలిన 9 సంవత్సరాలు మిర్చికి రూ.14వేలు ధర వచ్చింది.. జగన్ నువ్వు ఒక్క సంవత్సరం ముఖ్యమంత్రివా... లేక 5 సంవత్సరాల ముఖ్యమంత్రివా అని ప్రశ్నించారు.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com